

బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఎండ, వాన

- ఉదయం నుంచి భరించలేని ఉక్కపోత, ఎండ
- సాయంత్రం ఒక మోస్తరు వర్షం



విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం ఎండ, వాన కలబోతతో కూడిన వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మాడుపగిలే ఎండ కాసింది. గాలిలో తేమశాతం 80 శాతానికిపైగా నమోదు కావడంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆరుబయట ఉన్న వారంతా చమటతో తడిసిముద్దయ్యారు. మధ్యాహ్న సమయంలో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ద్విచక్ర వాహనచోదకులు ఎండకు ఇబ్బంది పడ్డారు. సాయంత్రం వరకు వేడి, ఉక్కపోత తగ్గలేదు. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఒక్కసారిగా మేఘాలు ఆవరించి తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. వర్షం కురిసినంత సేపే వాతావరణం చల్లబడింది. అయితే వర్షం తగ్గిన తరువాత మళ్లీ ఉక్కపోత కొనసాగింది.

రైతుల రుణాలు రీషెడ్యూల్ చేయండి

- వర్షాలకు నష్టపోయిన వారికి తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వండి
- బ్యాంకర్లకు కలెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు నష్టపోయిన రైతులకు రుణాలు రీషెడ్యూల్ చేయాలని, అదే సమయంలో తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీవర్షాలకు పద్మనాభం, పెందుర్తి మండలాల్లో 31 మంది రైతులకు చెందిన 7.84 హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు నివేదించారన్నారు. పంటలు దెబ్బతిన్న రైతులకు రుణాలు ఉన్నదీ, లేనిదీ పరిశీలించి రీషెడ్యూల్ చేయాలని, కొత్తగా రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే కాకానినగర్, నగరంపాలెం ప్రాంతాల్లో పశువులు మృతిచెందాయని, మళ్లీ పశువులు కొనుగోలు చేసుకునేందుకు వారికి రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా నష్టపోయిన మత్స్యకారులకు రుణాలు మంజూరుచేయాలన్నారు. జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజరు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీవర్షాలకు వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసి బాధితులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, రిజర్వు బ్యాంకు సూచనల మేరకు ఈ సమావేశం ఏర్పాటుచేశామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, మత్స్యశాఖ, పశుసంవర్థక శాఖ జేడీలు జి.విజయ, డాక్టర్ డి.రామకృష్ణ, పలు బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

సీటుకో రేటు!

నచ్చినచోట పోస్టింగ్‌కు రూ.5 లక్షలు

ఉన్నచోట నుంచి కదలకూడదంటే రూ.3 లక్షలు

- ఈపీడీసీఎల్‌లో బదిలీలకు ఫిక్స్‌డ్ రేట్లు
- భారీగా నేతల వసూళ్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గడువు పెంచుకుంటూ పోతుండడంతో కీలకమైన స్థానాలకు డిమాండ్ పెరిగిపోతోంది. బదిలీ వద్దనుకున్న వారు కూడా మంచి సీటులోకి వెళ్లి నాలుగు రాళ్లు వెనకేసుకోవాలని ఆరాటపడుతున్నారు. సిఫారసు లేఖలు ఇచ్చే ప్రజా ప్రతినిధులకు పోటాపోటీగా నజరానాలు సమర్పించుకుంటున్నారు.



మొన్నటి వరకు పోలీస్ శాఖలో బదిలీల జాతర జరిగింది. ఇప్పుడు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) వంతు వచ్చింది. ఇంకో పది రోజులు గడువు ఉండడంతో చాలామంది మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నేతల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. ఈపీడీసీఎల్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు ఎక్కువ. విద్యుత్ కనెక్షన్ కావాలంటే ముందుగా ఏఈ కార్యాలయంలోనే సంప్రతింపులు మొదలవుతాయి. కనెక్షన్ స్థాయిని బట్టి పై అధికారులకు ఫైల్ నడుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఉచిత వ్యవసాయ కనెక్షన్లు కూడా ఏఈల చేతులు మీదుగానే మంజూరవుతాయి. దీంతో బాగా ఆదాయం వచ్చే ప్రాంతాల్లో పోస్టు కోసం చాలా మంది ఏఈలు యత్నిస్తున్నారు. ఉద్యోగి అవసరాలు, అర్హతలు చూసి బదిలీ చేసే అవకాశం లేకపోవడం, ఎవరికి ఎక్కువ మంది నాయకులు సిఫారసు చేస్తే వారికే బదిలీ జరిగే పరిస్థితులు ఉండడంతో నేతల లేఖల కోసం ముడుపులు సమర్పించుకోవలసి వస్తోందంటున్నారు. కొందరు నాయకులు తమ చేతికి మట్టి అంటకుండా ఉండాలని ఈ వ్యవహారాలను బావమరుదులు, భార్య కుటుంబీకులకు అప్పగించేశారు. దాంతో వారు పోస్టును బట్టి రేటు ఫిక్స్ చేసేశారు. ఏదైనా సీటుకు బదిలీ చేయాలంటే...ఏఈ స్థాయి అధికారి నుంచి రూ.5 లక్షలు తీసుకుంటున్నారు. డిప్యూటీ ఇంజనీర్ స్థాయి పోస్టు అయితే ఆ రేటు ఇంకా ఎక్కువగా ఉంది. ఇక బదిలీ లేకుండా ఉన్న సీటులోనే కొనసాగించాలని కోరుకుంటే...దానికి ఏఈలు రూ.3 లక్షలు ఇచ్చుకుంటున్నారు. ఇలా డబ్బుతో పాటు సామాజిక సమీకరణాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈపీడీసీఎల్ పరిధి 11 జిల్లాలకు విస్తరించి ఉండడంతో ఆ మూలనున్న శ్రీకాకుళం జిల్లా నాయకులు తమ వారికి విశాఖ నగరంలో పోస్టింగ్‌లు ఇవ్వాలని సిఫారసు చేస్తున్నారు. అదే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి పోస్టు అయితే స్థానిక జిల్లా నాయకులకు నేరుగా వారే ఫోన్ చేసి, 'మా వాడు వచ్చి మిమ్మల్ని కలుస్తాడు...ఈసారికి సాయం చేయండి' అంటూ చెబుతున్నారు. ఒకవైపు డబ్బులు సమర్పించుకుంటూ మరోవైపు ఎక్కువ మంది నుంచి సిఫారసు లేఖలు తీసుకోవలసి వస్తోంది. విశాఖ నగరం వరకూ తీసుకుంటే జోన్ల వారీగా కార్యాలయాలు ఉన్నాయి. ఒక్కో జోన్ పరిధిలో రెండు నుంచి మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అంటే ఎవరైనా ... మిగతా 6వ పేజీలో

నాలుగు రైతుబజార్లకు సెలవులు రద్దు

- కొందరు రైతులు కోరారని ఎమ్మెల్యేల సిఫారసు
- ఉత్తర్వులు విడుదల చేసిన జాయింట్ కలెక్టర్



విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రధానమైన నాలుగు రైతుబజార్లకు వారాంతపు సెలవులను రద్దు చేస్తూ జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. సీతమ్మధార, కంచరపాలెం బజార్లకు ప్రతి మంగళవారం, ఎంవీపీ కాలనీ, నరసింహనగర్ బజార్లకు ప్రతి బుధవారం సెలవు. రాష్ట్రంలో ప్రతి రైతుబజార్‌కు వారంలో ఏదో ఒకరోజు సెలవు ప్రకటించి, ఆ రోజు లావాదేవీలు ఆపేస్తున్నారు. ఇది చాలా కాలంగా అమలులో ఉంది. ఇటీవల కొందరు ఎమ్మెల్యేలు రైతుబజార్లను సందర్శించినప్పుడు కొందరు రైతులు... బజార్లు మూసేయకుండా 24/7 నిర్వహించేలా చూడాలని కోరారు. అలాగే తమ వద్ద అద్దె వసూలు చేస్తున్నారని, ఉచితంగా స్టాళ్లు కేటాయించాలని డ్వాక్రా సంఘాల నిర్వాహకులు, పండ్ల దుకాణదారులు కోరారు. ఈ విషయాన్ని సదరు ఎమ్మెల్యేలు జాయింట్ కలెక్టర్‌కు లేఖ ద్వారా తెలియజేశారు. రైతుబజార్లన్నీ సొంత నిధులతో నిర్వహించుకునేలా పంటలు పండించే రైతులకు ఉచితంగా స్టాళ్లు కేటాయిస్తూ, ఉల్లి, బంగాళాదుంప, టమాటా వంటివి హోల్‌సేల్ బజారులో కొని, రైతుబజార్లలో విక్రయించే డ్వాక్రా సంఘాల నుంచి స్టాళ్లకు అద్దె వసూలు చేస్తున్నారు. అలాగే పండ్లను కూడా బయట కొని విక్రయించే వారి నుంచి అద్దె వసూలు చేస్తున్నారు. సొంతంగా వ్యవసాయం చేసే రైతులకు ఉచితంగానే ఇస్తున్నారు. ఇదే విషయం ... మిగతా 6వ పేజీలో

తహసీల్దార్ల బదిలీలపై తర్జనభర్జన

నగరం/మైదానం నుంచి ఏజెన్సీకి వెళ్లబోమంటున్న జూనియర్లు



- నేతల ద్వారా సిఫారసులు
- మరోవైపు పాడేరు డివిజన్ నుంచి ఏడుగురిని మైదాన ప్రాంతానికి పంపేందుకు అల్లూరి జిల్లా అధికారులు సుముఖం
- ఐటీడీఏ నిబంధనలు అమలుచేయాలని కోరుతున్న ఏజెన్సీ తహసీల్దార్లు
- ఇటు నుంచి ముగ్గురినే పంపుతారని ప్రచారం
- త్వరలో మూడు జిల్లాల కలెక్టర్ల భేటీ

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి జిల్లాలో జూనియర్లు అయిన తహసీల్దార్లు కొందరు నగరం, మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి వెళ్లేందుకు ససేమిరా అంటున్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పనిచేస్తాం తప్ప ఏజెన్సీ మండలాలకు వెళ్లలేమని తెగేసి చెబుతున్నారు. అదే సమయంలో ఏజెన్సీ నుంచి మైదానం/నగర ప్రాంతాలకు బదిలీ చేయాల్సిందిగా వచ్చిన దరఖాస్తుల్లో ఏడింటిని అల్లూరి జిల్లా యంత్రాంగం పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిసింది.

ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి తహసీల్దార్లు రాగా ఒక్క విశాఖ జిల్లాలోనే పోస్టింగ్స్ ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, ఆ తరువాత వర్షాలు, వరదలు రావడంతో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఇంకా పోస్టింగ్స్ ఇవ్వలేదు. ఈలోగా బదిలీలకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లో పనిచేస్తున్న తహసీల్దార్లు మైదానం, నగరానికి వచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం ఐటీడీఏ పరిధిలో ఉద్యోగి/అధికారి ఏకకాలంలో రెండేళ్లకు పైబడి పనిచేసినా...వయస్సు 50 ఏళ్లు దాటినా మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలి. ఈ నిబంధనల ప్రకారం పాడేరు ఏజెన్సీలో పనిచేస్తున్న ఎనిమిది మంది తహసీల్దార్లు బదిలీకి అర్హులుగా తేలారు. అందులో ఒకరు అక్కడే పనిచేయడానికి సుముఖత (స్పౌజ్ అక్కడే టీచరుగా పనిచేస్తున్నారు) వ్యక్తంచేయడంతో మిగిలిన ఏడుగురినీ అక్కడ నుంచి రిలీవ్ చేయడానికి అల్లూరి జిల్లా కలెక్టర్ సుముఖత వ్యక్తంచేశారని అంటున్నారు. ఏజెన్సీ నుంచి ఎంతమంది తహసీల్దార్లు కిందకు వస్తారో...అంతమందిని మైదానం/నగరం నుంచి ఏజెన్సీకి వెళ్లాలి. కానీ మైదానం/నగరంలో పనిచేస్తున్న తహసీల్దార్లు (50 ఏళ్ల కంటే తక్కువ వయస్సు, గతంలో ఏజెన్సీలో ఎప్పుడు పనిచేయనివారు) ఏజెన్సీకి వెళ్లేందుకు సుముఖంగా లేరని రెవెన్యూ వర్గాల్లో ప్రచారం సాగుతుంది. కొతమంది రాజకీయంగా తమకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి ఇక్కడే కొనసాగేందుకు అన్ని రకాలుగా పైరవీలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో ఐదారుగురు తహసీల్దార్లు సర్వీస్‌లో బాగా జూనియర్లు. వారు కూడా కదలంటున్నారు. అయితే 58 ఏళ్లు దాటిన తహసీల్దారును మాత్రం ఏజెన్సీకి పంపేందుకు యత్నిస్తున్నట్టు తెలిసింది. అలాగే అనకాపల్లి జిల్లా నుంచి 55 ఏళ్లు దాటిన ఇద్దరు తహసీల్దార్లను ఏజెన్సీకి పంపాలని యత్నిస్తున్నారని చెబుతున్నారు. మరోవైపు ... మిగతా 6వ పేజీలో

ఏయూలో బోధనేతర సిబ్బందికి బదిలీలు

- గుట్టుగా నిర్వహించడంపై భిన్నాభిప్రాయాలు
- వివాదాలకు తావివ్వకూడదనే అంటున్న అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నాన్ టీచింగ్ సిబ్బందిని అధికారులు అంతర్గత బదిలీ చేశారు. వర్సిటీలో వివిధ సెక్షన్లలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లు... మొత్తం 98 మందిని బదిలీ చేశారు. గడిచిన రెండు రోజులు నుంచి ఈ బదిలీలు జరుగుతున్నాయి. అయితే, వీటిని గుట్టుగా నిర్వహించడం ఇప్పుడు వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా ఆయా కేడర్లకు సంబంధించిన బదిలీలు నిర్వహించేటప్పుడు ఎవరెవరికీ స్థాన చలనం కలిగిందీ జాబితాను విడుదల చేసేవారు. వారంతా ఎస్-3 సెక్షన్‌కు వెళ్లి తమకు బదిలీ జరిగిన విభాగానికి సంబంధించిన వివరాలను తెలుసుకుని వెళ్లి చేరేవారు. దీనివల్ల మొత్తం ఎంతమందికి బదిలీ జరిగింది, ఏ విభాగం నుంచి ఏ విభాగానికి బదిలీపై వెళ్లారన్న విషయాలు అందరికీ తెలిసేవి. కానీ, ఈసారి అధికారులు అందుకు విరుద్ధంగా గుట్టుగా బదిలీ ప్రక్రియను నిర్వహించారు. బదిలీ జరిగిన వారికి వ్యక్తిగతంగా ఆర్డర్లను ఇచ్చారు. ఎస్-3 సెక్షన్‌కు వెళ్లి ఆర్డర్ తీసుకునేంత వరకు ఎక్కడకు బదిలీ జరిగిందన్న విషయం సదరు ఉద్యోగికి కూడా తెలియడం లేదు. దీనిపై ప్రస్తుతం వర్సిటీలో జోరుగా చర్చ జరుగుతోంది. ఉన్నతాధికారులు ఉద్దేశం ఏమిటో అర్థం కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. అయితే వివాదాలకు అవకాశం ఇవ్వకూడదన్న ఉద్దేశంతోనే ఈ విధంగా చేసినట్టు వర్సిటీ అధికారులు చెబుతున్నారు. బదిలీ అయిన ఉద్యోగి తమకు కేటాయించిన స్థానానికి వెళ్లి చేరడం తప్ప మరో మార్గం ఉండదని పేర్కొంటున్నారు.

విశాఖ ఉక్కుకు రూ.3 వేల కోట్ల సాయం?

ఢిల్లీలో ఉన్నత స్థాయి సంప్రతింపులు - వార్త మెయిన్‌లో

రేపు ఘంటసాల బయోపిక్ సినిమా ప్రివ్యూ షో..



డాబాగార్డెన్స్, సెప్టెంబరు 13: సినీ రంగ వైతాళికులు, స్వరకర్త, అపూర్వ గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితాన్ని వెండితెరపై ఆవిష్కరించిన ప్రయత్నం 'ఘంటసాల' సినిమా అని ఘంటసాల ఆరాధకుల సమూహం ప్రతినిధి డాక్టర్ ఎస్.రహమతుల్లా అన్నారు. ఘంటసాల (బయోపిక్) ది గ్రేట్ తెలుగు సినిమాను ప్రివ్యూ షోను ఈ నెల 15న విశాఖలోని సంగం-శరత్ థియేటర్‌లో ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రదర్శించ నున్నట్లు తెలిపారు. ఈ చిత్రాన్ని డిసెంబరు 4న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాత, దర్శకులు సీహెచ్ రామారావు కృషిచేస్తున్నట్లు తెలిపారు. నేటి యువతరానికి, ఘంటసాల అభిమానులకు ఆయన జీవిత విశేషాలు తెలియజేసే అవకాశం ఈ చిత్రం ద్వారా కలుగుతుందన్నారు. ఇతర వివరాలకు ఫోన్ 98669 70816, 73960 35410ను సంప్రదించాలని ఆయన కోరారు.

విసిగించిన విద్యుత్ కోత

మాధవధార, సెప్టెంబరు 13; పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఉదయం కూడా మాధవధార (ఎస్ఎస్‌టీఎల్) సబ్ స్టేషన్ పరిధిలోని మాధవధార ఉడాకాలనీ ప్రాంతాలకు కరెంటు రావడం, వెనువెంటే పోవడం స్థానికులకు చికాకు పుట్టించింది. ఉదయం తీవ్రంగా కాసిన ఎండలకు తోడు పలుమార్లు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఉక్కబోతతో సతమతమయ్యారు. దీనిపై సబ్ స్టేషన్ సహాయక ఇంజనీరు అప్పలరాజు వివరణ ఇస్తూ ఈ ప్రాంతాల్లో నిర్వహణ పనుల కారణంగా సరఫరాకు అంతరాయమైందన్నారు. సాయంత్రం మారిన వాతావరణంతో అయిదు గంటల నుంచి రాత్రి ఎనిమిది దాటిన వరకు సరఫరా లేదు. ఈ కారణంగా ఈ ప్రాంతాల్లో వ్యాపార వర్గాలు, నివాసితులు అవస్థలు పడ్డారు.



ఆంధ్రజ్యోతి కార్యాలయం పక్కన లక్ష్మీగణపతి ఆలయంలో వినాయకుడు శుక్రవారం లక్ష్మీగణపతిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గణపతి కల్యాణం నిర్వహించారు. -విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



సీతంపేట ప్రధాన రహదారిలోని దుర్గాగణపతి ఆలయంలో శుక్రవారం విష్ణుగణపతిగా భక్తులకు దర్శనమిస్తున్న వినాయకుడు -సీతంపేట



గ్రేటరు 51వ వార్డు కళింగనగర్ యూత్ ఆధ్వర్యంలో కొలువైన గణేషుడికి విశేష పూజలు జరుగుతున్నాయి. -మురళీనగర్

ఆలయంలో దోష నివారణకు పవిత్రోత్సవాలు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 13: దేవాలయాల్లో దోష నివారణ కోసం సంవత్సరంలో ఒకసారి పవిత్రోత్సవాల పూజలు నిర్వహిస్తారని అర్చకులు వెల్లడించారు. శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవ పూజలను ఆలయ అధికారులు, వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పూజల్లో పాల్గొన్న ఈవో శ్రీనివాసులు రెడ్డి, ఆలయ అధికారుల చేత అర్చకులు, వేదపండితులు తొలుత విశేషపూజలను భక్తితో నిర్వహించారు. పంచామృతాభిషేకం, గర్భాలయ దర్శనం వంటివి కొంత సేపు నిలిపివేశారు. నిత్య పూజాదికాలను ఆలయ అధికారులు నిర్వహించారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 13: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో పోర్టు కళావాణి ఆడిటోరియంలో యూ జీనియస్ 3.0 క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హరేందిర్ ప్రసాద్, జోనల్ హెడ్ షాలినీ మీనన్ హాజరయ్యారు. 6 జట్లు తుది రౌండుకు చేరుకోగా వీటిలో విజేతగా డి పాల్ స్కూల్, రన్నరప్‌గా విశాఖవాలీ స్కూల్ నిలిచాయి.కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ హెడ్స్ దేవర శంకర్, శంకర్ హెంబ్రం తదితరులు పాల్గొన్నారు.

'న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి'



సీతమ్మధార యూనియన్ బ్యాంక్ వద్ద నిరసన నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

సీతమ్మధార, సెప్టెంబరు 13: సీతమ్మధార యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బ్యాంక్ అధికారుల సంఘం నాయకుడు కె.రమేష్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర కార్యాలయంలోని ఉన్నత శ్రేణి యాజమాన్యంతో అధికారుల సంఘం, గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలు కలిసి 20 అంశాలపై జరిపిన చర్చలు విఫలం కావడంతో శుక్రవారం దేశ వ్యాప్తంగా 134 ప్రాంతీయ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అధికారులపై పని ఒత్తిడి ఎక్కువగా ఉందని, యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. అవార్డు ఉద్యోగుల సంఘం ప్రాంతీయ కార్యదర్శి ఆర్.వసంతరావు మాట్లాడుతూ బ్యాంక్ శాఖల్లో గుమస్తా ఖాళీలు భర్తీ చేయాలని, కారుణ్య నియామకాలు వెంటనే పూర్తి చేయాలని, తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో త్రినాథ్, సాగర్, శ్రీనివాస్, అనిల్, గురుమూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేధిస్తున్న తాగునీటి సమస్య

- వన్‌టౌన్ పరిధిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వాట్సాప్ సందేశం

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 13: వన్‌టౌన్ పరిసర ప్రాంతాల్లో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. కుళాయి నీటి సరఫరా లోపభూయిష్టంగా తయారవ్వడం, 30 నుంచి 39 వార్డుల్లో సక్రమంగా తాగునీటి సరఫరా జరగకపోవడం నిత్యకృత్యంగా మారిందని ప్రజలు జీవీఎంసీ నీటిసరఫరా విభాగం అధికారులను విమర్శిస్తున్నా రు. వారం రోజులుగా మహిళలు తాగునీటి కోసం కుళాయిల వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది. పూర్ణామార్కెట్ పెరికివీధి తరహాలో వన్‌టౌన్‌లోని పలు వార్డుల్లో మహిళలు తాగునీటి సమస్యపై రోడ్డెక్కేందుకు సిద్ధమవుతున్నారనే విషయం ప్రచారంలోకి వచ్చింది. పాతనగరంలో పూర్తిగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యధోరణి అవలంబిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు గ్రేటర్ 37వ వార్డు పెయిన్‌దొరపేటలో కుళాయి నీటి సరఫరా సక్రమంగా లేదంటూ జనసేన పార్టీకి చెందిన పీతల శ్రీనివాసరావు వాట్సాప్ సమాచారం ఇచ్చారు. అదేవిధంగా 30, 35, 36 వార్డుల్లో కుళాయి నీటిని విడుదల చేసినా ఒకటి రెండు బిందెలకే పరిమితమైందని మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు వార్డుల్లో నాయకులపై మహిళలు విరుచుకుపడుతున్నారు. దక్షిణ ఎమ్మెల్యే తక్షణం వన్‌టౌన్ తాగునీటి సమస్యను గాడిలో పెట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

24 నుంచి ఆలిండియా రైల్వే బాక్సింగ్ చాంపియన్‌షిప్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తదితరులు

విశాఖపట్నం (స్పోర్ట్స్), సెప్టెంబరు 13: తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ వాల్తేరు డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి జరగనున్న అఖిల భారత పురుషుల మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ పోస్టర్‌ను డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వాల్తేరు రైల్వే స్పోర్ట్సు ఎరీనాలో నాలుగు రోజులు జరిగే ఈ టోర్నీలో భారతీయ రైల్వేలోని వివిధ జోన్లకు చెందిన అంతర్జాతీయ, జాతీయ బాక్సింగ్ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్న నేపథ్యంలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, స్పోర్ట్సు ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ బి.అవినాష్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు నైపుణ్యాలు అందివ్వడమే లక్ష్యం

ఐఐఎం డైరెక్టర్ చంద్రశేఖర్

మహారాణిపేట, సెప్టెంబరు 13: అధునాతన యాజమాన్య నైపుణ్యంతో పని చేసేవారిని మరింత శక్తిమంతులుగా చేసే లక్ష్యంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రవేశాలు ప్రారంభించినట్లు డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మహారాణిపేటలోని ఓ సమావేశమందిరంలో ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థికశాస్త్రం, ఫైనాన్స్ అకౌంటింగ్, మానవ వనరులు, వ్యూహాత్మక ఆలోచన, బిజినెస్ ఎథిక్స్ చట్టం వంటి అంశాలను వివరించారు. వ్యూహాత్మక దూరదృష్టి, ఆధునిక వ్యాపార చిక్కులను నేర్పుగా తొలగిస్తూ ముందుకు దూసుకు వెళ్లగల నాయకులను తయారు చేయాలన్నారు. సమావేశంలో యువతీ యువకులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పాఠశాలలో వన సంరక్షణ



కార్పొరేటర్ శ్రావణికి మొక్క అందజేస్తున్న ఉపాధ్యాయినులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 13: శ్రీ సాయి సరిగ వంప ట్రస్ట్, బృందావన్ హెల్పింగ్ హ్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అక్కయ్యపాలెం ఎన్జీజీఓఎస్ కాలనీ జీవీఎంసీ పాఠశాలలో వనసంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 26వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ ముక్కా శ్రావణి, గౌరవ అతిథిగా ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీసరస, సంస్థ వ్యవస్థాపకులు హర్షవల్లి పాల్గొన్నారు..

సెయింట్ జోసెఫ్‌లో హిందీ వారోత్సవాలు



కళాశాల వార్షిక పత్రికను ఆవిష్కరిస్తున్న అతిథులు, విద్యార్థినులు

జ్ఞానాపురం, సెప్టెంబరు 13: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. వారం రోజులుగా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తూ కవితా లేఖనం, క్విజ్, గీతాలాపన, వ్యాసరచన, అంత్యాక్షరి తదితర పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ కళాశాల హిందీ ఆచార్య డా.బి.లక్ష్మి హాజరై హిందీ భాష ప్రాముఖ్యాన్ని వివరించారు. అనంతరం కళాశాల హిందీ వార్షిక పత్రిక ప్రతిభ 18వ సంచికను ఆమె ఆవిష్కరించారు. వివిధ పోటీల విజేతలకు అతిథులు జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందజేశారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న గ్రాండ్ పేరెంట్స్, విద్యార్థినులు

సీతంపేట, సెప్టెంబరు 13: ద్వారకానగర్‌లో గల రవీంద్రభారతి పాఠశాలలో గ్రాడ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాతయ్యలు, అమ్మమ్మ, నాన్నమ్మల పాదాలకు విద్యార్థులు నమస్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఉమ్మడి కుటుంబాల్లో తాతయ్య, అమ్మమ్మ, నాన్నమ్మలకు చాలా ప్రాముఖ్యం ఉందని, క్రమశిక్షణ, విలువలను వారి నుంచి పొందవచ్చని పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్.గాయత్రి తెలిపారు. తమ అనుభవాలను పెద్దలంతా ఉపాధ్యాయులు, విద్యార్థులతో పంచుకున్నారు.

సీటుకో రేటు!

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగి బదిలీ కావాలనుకుంటే ఒక్కరి సిఫారసు సరిపోవడం లేదు. ఎంతమంది ఉంటే అంతమంది దగ్గర నుంచి లేఖలు తీసుకుంటేనే 100 శాతం పని పూర్తయ్యే పరిస్థితి ఉంది. ఈ బదిలీల వ్యవహారం పూర్తిగా ఉన్నతాధికారుల చేయి దాటి పోయింది. రాజకీయ సిఫారసుల మేరకే నిర్ణయాలు తీసుకోవలసి వస్తోంది. దాంతో ఎక్కువమంది నాయకులను ప్రసన్నం చేయించుకునేవారికే అవకాశం లభిస్తోంది. ఇంతకుముందు బదిలీ లేఖలను ఉదారంగానే ఇచ్చేవారు. ఇప్పుడు ఎందుకనో ప్రతిఒక్కరూ లక్షలు వసూలు చేస్తున్నారు. ఆఖరుకు కూటమి పార్టీల నాయకులు కూడా సిఫారసు చేస్తున్నారు.

తహసీల్దార్ల బదిలీలపై తర్జనభర్జన

... 5వ పేజీ తరువాయి

బదిలీల విషయంలో ఐటీడీఏ నిబంధనలు అమలు చేయాలని, లేకపోతే న్యాయ పోరాటం చేస్తామని ఏజెన్సీలో పనిచేస్తున్న కొందరు తహసీల్దార్లు అంటున్నట్టు తెలిసింది. ఇదిలావుండగా నగరంలో పనిచేస్తున్న ముగ్గురు తహసీల్దార్లు అనకాపల్లి జిల్లాకు వెళ్లేందుకు సుముఖత వ్యక్తంచేశారు. కూటమికి చెందిన ప్రముఖుడొకరు తన నియోజకవర్గంలో పనిచేయాలని సూచించడంతో ఒకరు, మరో ఎమ్మెల్యే కోర్కె మేరకు ఇంకొక తహసీల్దారు అనకాపల్లి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. గతంలో శివారు ప్రాంతంలో పనిచేసి ప్రస్తుతం నగరంలో పనిచేస్తున్న మరో తహసీల్దారు అనకాపల్లికి వెళ్లడానికి నిర్ణయించారు. అనకాపల్లి జిల్లా నుంచి ఇద్దరు మహిళా తహసీల్దార్లు నగరానికి రావడానికి అక్కడ అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. కాగా విశాఖ జిల్లాలో పనిచేస్తున్న కొందరు తహసీల్దార్లపై ఉన్నతాధికారులు అసంతృప్తితో ఉన్నందున కనీసం ఇద్దరు లేదా ముగ్గురిని అనకాపల్లికి పంపాలని లేదా అప్రాధాన్య పోస్టుల్లో నియమించాలని భావిస్తున్నారు. మరో తహసీల్దార్ అయితే ప్రస్తుతం పనిచేస్తున్న మండలం నుంచి తప్పించాలని కోరుతున్నారు. కలెక్టరేట్‌లో పనిచేయడానికి సిద్ధపడినట్టు చెబుతున్నారు. మరో తహసీల్దారు విషయంలో కూటమికి చెందిన కీలక నేత ఒకరు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, సదరు అధికారిని ఏజెన్సీకి పంపాలని ఉన్నతాధికారులకు స్పష్టంచేశారని జోరుగా ప్రచారం జరుగుతుంది. కాగా బదిలీలకు ఈనెల 22 వరకు గడువు పొడిగించడంతో వచ్చే వారం ఉమ్మడి జిల్లా పరిధిలో ముగ్గురు కలెక్టర్లు భేటీ అయి తహసీల్దార్ల బదిలీలపై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిసింది.

నాలుగు రైతుబజార్లకు సెలవులు రద్దు

... 5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యేలకు జాయింట్ కలెక్టర్ తెలియజేసి, వ్యాపారం చేసే వారి నుంచే అద్దెలు తీసుకుంటున్నామని వివరించారు. అయితే వారం వారం సెలవు తీసేయాలని కోరడంతో ఆ మేరకు మొదట నాలుగు బజార్లకు సెలవులు రద్దు చేస్తూ, 24/7 నడపాలని ఆదేశాలు జారీచేశారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖ నగరానికి ఉల్లి, బంగాళాదుంపలు, టమాటా, ఇతర కూరగాయలు సరఫరా చేసే జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌ను కూడా ప్రతి ఆదివారం మూసేస్తారని, రాష్ట్రంలో అన్ని బజార్లకు సెలవులు ఉన్నాయని, ఇక్కడే సెలవులు రద్దు చేయడం అన్యాయం అనే వాదన వినిపిస్తోంది. అన్ని రైతుబజార్లు ఒకే రోజున మూసేయడం లేదు. ఎంవీపీ కాలనీలో బజార్ మూసేస్తే ఆ ప్రాంత వినియోగదారులు అటు పెదవాల్తేరు కానీ, ఇటు సీతమ్మధార కాని వచ్చి కొనుక్కునే వెసులుబాటు ఉంది. అలాగే సీతమ్మధార రైతుబజార్‌ను మంగళవారం మూసేస్తే ఆ ప్రాంతీయులు ఎంవీపీ కాలనీ కానీ, నరసింహనగర్ గానీ వెళ్లి కొనుక్కోవచ్చు. ఇలా ఇబ్బందులు లేకుండా ఒకేరోజు పక్కపక్క బజార్లకు సెలవు లేకుండా ఏర్పాట్లు చేశారు. అయినా రైతులు అడిగారని ఎమ్మెల్యేలు బజార్లకు సెలవు లేకుండా చేయడం సమంజసం కాదనే వాదన వినిపిస్తోంది. వారానికి ఒకరోజు సెలవు ఇవ్వడం వల్ల ఆ రోజున బజార్ మొత్తం శుభ్రం చేసుకోవడానికి వీలవుతోందని నిర్వాహకులు చెబుతున్నారు. అధికారులు మరోసారి ఆలోచన చేసి నిర్ణయం ప్రకటించాలని కోరుతున్నారు. రైతులకు మేలు చేయాలంటే వారికి సరిపడా కొత్త బజార్లు ఏర్పాటు చేయాలని, కూరగాయలు తెచ్చుకోవడానికి అదనపు బస్సులు తిప్పాలని, గిట్టుబాటు ధరలు కల్పించాలే తప్ప ఇలా సెలవు రద్దు చేస్తే పెద్దగా ప్రయోజనం ఉండదనే వాదన వినిపిస్తున్నారు.

విద్యార్థులు దేశభక్తిని అలవరచుకోవాలి

- సెంచూరియన్ వర్సిటీ గౌరవ చాన్స్‌లర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు



వన్‌టౌన్ ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో విద్యార్థుల బృందగానం

జగదాంబ కూడలి, సెప్టెంబరు 13: విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తిని అలవర్చుకోవాలని సెంచూరియన్ యూనివర్సిటీ గౌరవ ఛాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. వన్‌టౌన్ ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో భారత్ వికాస్ పరిషత్, ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా విభాగం సంయుక్తంగా శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన దేశభక్తి బృందగాన పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య రాజు మాట్లాడుతూ విద్యార్థులకు బృందగాన పోటీలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో బృందగాన పోటీలను పైడా విద్యా సంస్థల అధినేత కృష్ణప్రసాద్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ పోటీల్లో నగరానికి చెందిన పలు పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. హిందీ, సంస్కృతం, జానపదం, మాతృభాషలో దేశభక్తి గీతాలను విద్యార్థులు ఎంపిక చేసుకుని బృందగానం చేశారు. పలువురు సంగీత ప్రముఖులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు నిర్వాహకులు ప్రశంసా పత్రం, బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు వంకాయల సన్యాసిరాజు, రమేష్ చంద్రజైన్, ఎంవీవీ సత్యనారాయణ, ఎంవీ రాజశేఖర్, సీహెచ్ సత్యనారాయణ, పి.భాస్కరరావు, మాణిక్యాలరావు, పి.షర్మిళ, వి.భువన సుందరి, ప్రోగ్రాం కన్వీనర్ పి.వెంకటేశ్వరరావు, ఎంఎస్ఎల్ శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్-శ్రీకాకుళం మధ్య ప్రత్యేక ఏసీ రైలు

విశాఖపట్నం, సెప్టెంబరు 13: పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా సికింద్రాబాద్, శ్రీకాకుళం రోడ్డు మధ్య ప్రత్యేక ఏసీ రైలు సర్వీసులు ప్రవేశపెడుతున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07487 నంబరు గల ప్రత్యేక ఏసీ రైలు అక్టోబరు 2 నుంచి నవంబరు 6 వరకు ప్రతి బుధవారం రాత్రి 7.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.10 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07488 నంబరు గల ఏసీ ప్రత్యేక రైలు అక్టోబరు 3 నుంచి నవంబరు 7 వరకు గురువారం సాయంత్రం 5.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో బయలుదేరి రాత్రి 6.47 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 9.50 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ సర్వీసులు 17 థర్డ్ ఏసీ, రెండు మోటారు కార్ కోచ్‌లతో నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

పలు రైళ్ల గమ్యం కుదింపు...రీ షెడ్యూల్

విశాఖపట్నం, సెప్టెంబరు 13: వాల్తేరు డివిజన్ పరిధిలోని పూండి-నౌపడ, తిలారు-కోటబొమ్మాళి సెక్షన్ల మధ్య భద్రత నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-పలాస మధ్య నడిచే 07470, 07471 నంబర్లు గల మెము రైళ్లు ఈ నెల 19, 21 తేదీల్లో విశాఖ-శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య రాకపోకలు సాగిస్తాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు-పలాస మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామని పేర్కొన్నారు.

రీ షెడ్యూల్; ఈనెల 18న సాయంత్రం 6.50 గంటలకు పాండిచ్చేరిలో బయలుదేరాల్సిన పాండిచ్చేరి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (1289) రాత్రి 9.35 గంటలకు (రెండు గంటల 45 నిమిషాలు), అలాగే ఈ నెల 18, 20 తేదీల్లో మధ్యాహ్నం 1.40 గంటలకు కేఎస్ఆర్ బెంగళూరులో బయలుదేరాల్సిన కేఎస్ఆర్ బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464) సాయంత్రం 4.10 గంటలకు (రెండు గంటల 30 నిమిషాలు) ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్లు పేర్కొన్నారు.

అంతర్జాతీయ మాస్టర్స్ క్రీడా పోటీల్లో వెంకటలక్ష్మికి 4 స్వర్ణ పతకాలు



సాధించిన పతకాలతో నాగ వెంకటలక్ష్మి

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 13: నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ మాస్టర్స్ క్రీడా పోటీల్లో నగరానికి చెందిన ఆళ్ల నాగ వెంకట లక్ష్మి నాలుగు స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన నాగ వెంకట లక్ష్మి అథ్లెటిక్స్ మహిళల 45 ప్లస్ ఏళ్ల 60 మీ. రేస్‌తోపాటు డిస్కస్ త్రో, జావెలిన్ త్రో ఈవెంట్లలో ప్రథమ స్థానంలో నిలిచారు. మహిళల పవర్ లిఫ్టింగ్ 85 కిలోల టోర్నీలో అత్యధిక బరువెత్తి స్వర్ణ పతకం సొంతం చేసుకున్నారు. ఇప్పటి వరకు అనేక అంతర్జాతీయ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్, ఐరన్ గేమ్‌లలో పాల్గొని పతకాలు సాధించిన నాగ వెంకట లక్ష్మి, ప్రతిష్ఠాత్మక పోక్రా గేమ్స్ అండ్ స్పోర్ట్సులో నాలుగు స్వర్ణ పతకాలు సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

భెల్ హెచ్‌పీవీపీ సరిహద్దున ప్రహరీ నిర్మించాలని వినతి


ఏజీఎం లీల కు వినతి పత్రం అందచేస్తున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తదితరులు

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 13: తుంగ్లాం కాలనీ వైపునున్న భెల్ హెచ్‌పీవీపీ కర్మాగారానికి సంబంధించిన ప్రహరీని నిర్మించాలని ఆ యాజమాన్యాన్ని 69 వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కోరారు. శుక్రవారం ఏజీఎం ఎ. లీలను తుంగ్లాం కాలనీ నాయకులతో వెళ్లి ఆయన కలిసి సమస్య వివరించారు. తుంగ్లాం శ్మశాన వాటికకు ఆనుకున్న ఉన్నకర్మాగార ప్రహరీ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు నావన సింహచలం, పెట్ల శ్రీను, గెడ్డం శివ, కుంచారావు పాల్గొన్నారు.

గాజువాక సీఐగా పార్థసారథి


సీఐగా బాధ్యతలు స్వీకరించిన పార్థసారథి

గాజువాక, సెప్టెంబరు 13: గాజువాక పోలీస్ స్టేషన్ సీఐగా టి.పార్థసారథి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎం. శ్రీనివాసరావు రేంజ్‌కు బదిలీ కావటంతో మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌గా విధులు నిర్వహించిన పార్థసార థి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతి భద్రతలు కాపాడేందుకు అందరి సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు.

పెందుర్తి సీఐగా రామకృష్ణ


బాధ్యతలు స్వీకరించిన సతీశ్‌కుమార్

పెందుర్తి: పెందుర్తి సీఐగా కేవీఎస్ సతీశ్‌కుమార్ నియమితులయ్యారు. ఏసీబీ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన సీఐ ఎల్. రామకృష్ణ డీఐజీ కార్యాలయంకు రిపోర్టింగ్ చేశారు. స్టేషన్ హౌస్ అధి కారి (ఎస్‌హెచ్‌వో)గా చార్జి సతీశ్‌కుమార్ తీసు కున్నారు. అనంతరం సిబ్బందితో స మావేశమై పోలీసు స్టేషన్ పరిధి తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై వారికి సేవలందించాలని సూచించారు.

జాబ్‌మేళాలో 56 మంది ఎంపిక

పెందుర్తి, సెప్టెంబరు 13: పెందుర్తిలోని ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ గ్రూపుల్లో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న 56 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ మేళాలో ఎంఎస్ స్క్వేర్ టెక్నాలజిస్ సంస్థ ఈ ఎంపికలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.థియోఫిలస్, ప్రిన్సిపాల్ ఫ్లోరా పాల్గొన్నారు.

దుర్గా ఆలయ హుండీ ఆదాయం రూ.5.44 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

మల్కాపురం, సెప్టెంబరు 13: యారాడ కొండపై ఉన్న దర్గా ఆలయ హుండీ లెక్కింపు గురువారం రాత్రి నిర్వహించారు. రెండేళ్లపాటు ఆదాయం రూ.5.44 లక్షలు వచ్చింది. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అహ్మద్ పర్యవేక్షణలో కమిటీ సభ్యులు, భక్తులు ఈ లెక్కింపులో పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 52, టమాటా 30, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 64, బెండకాయలు 55, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయలు 40, కాలీఫ్లవర్ 34, క్యాబేజ్ 24, క్యారెట్ 40, దొండకాయలు 38, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 70, బీట్‌రూట్ 32, బరబాటి 50, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 34, దోస కాయలు 42, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 90, పొటల్స్ 50, కీరదోస 32, క్యాప్సికమ్ 72, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 54, కంద 54, దేముడుచిక్కుడు 72, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడిఅల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..


పారిశ్రామిక ప్రాంతంలో మంచినీటి సరఫరా విభాగ కార్యాలయం


పథకం కోసం నిర్మించిన భారీ ట్యాంక్

అక్కరకురాని తాగునీటి పథకం

- పదేళ్లుగా నిర్మాణ పనులు
- తుప్పుపడుతున్న పైప్‌లైన్లు
- పారిశ్రామిక ప్రాంత వాసులకు తప్పని తాగునీటి కష్టాలు

మల్కాపురం, సెప్టెంబరు 13: జీవీఎంసీ ప్రయోగాత్మకంగా పారిశ్రామిక ప్రాంతంలో బృహత్తర తాగునీటి పథకం నిర్మాణ పనులు అసంపూర్తిగా దర్శన మిస్తోంది. పదేళ్ల కిందట ప్రారంభించిన ఈ పనులు ఇప్పటికీ నత్తనడకనే సాగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్ రెడ్డి, పశ్చిమ నియోజక వర్గం ఎమ్మెల్యేగా మళ్ల విజయప్రసాద్ ఉన్న సమయంలో ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. రూ.100 కోట్ల నిధులు కేటాయించారు. కానీ, ఇప్పటికీ కూడా ఈ పథకం అక్కరకు రాలేదు. అయితే, వైసీపీ ప్రభుత్వ హయాంలో మరోసారి ఈ పథకానికి మళ్లీ శంకుస్థాపన చేశారు. పారిశ్రామిక


కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మోటార్లు

ప్రాంతం మొత్తానికి కాకుండా కేవలం 59, 60, 61 వార్డులకు గాను ఈ పథకం పరిమితం చేశారు. జేఎన్ఎన్‌యుఆర్‌ఎం నిధుల నుంచి రూ. 3.16లక్షలు కేటాయించి కొత్తగా ఈ పనులు ప్రారంభించారు. ఈ మేరకు పారిశ్రామిక ప్రాంతం మంచినీటి సరఫరా విభాగం కార్యాలయ ప్రాంగణంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అక్టోబర్ 13, 2021 న శంకుస్థాపన చేపట్టారు. ఆరునెలల్లో ఈ పథకం పనులు పూర్తి చేస్తామని అప్పట్లో ప్రకటించారు. అనంతరం సంబంధిత కాంట్రాక్టర్ ఈ పనులను నత్తనడకన సాగిస్తున్నారు. పర్యవేక్షణకు జీవీఎంసీ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేసినా వారు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ పథకానికి సంబంధించి గాజువాక ఆర్టీసీ డిపో, ఇందిరాకాలనీ, త్రినాథ్‌పురంలలో భారీ ట్యాంక్‌లను కూడా నిర్మించారు. వీటికి అనుసందానం చేయాల్సిన పైప్‌లైన్ ను కొంతమేర వేసి, మిగిలిన చోట్ల విడిచిపెట్టారు. రోజుల తరబడి వదిలేయడంతో భూగర్భంలో వేసిన కొన్నిచోట్ల పైప్‌లైన్లు మరమ్మతుకు గురయ్యాయి. పదిరోజుల కిందట ఈపైప్‌లైన్లకు కనెక్షన్లు ఇచ్చేందుకు మంచినీటి సరఫరా విభాగం ఆవరణలో ఉన్న ట్యాంక్ వద్ద రెండు భారీ మోటార్లను తీసుకువచ్చి అక్కడ బిగించి గుడ్డలు కప్పేసి ఉం చారు. సంబంధిత అధికారులు , ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ పథకం పనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

'కార్మిక సంక్షేమమే ఇంటక్ లక్ష్యం'


మాట్లాడుతున్న ఇంటక్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 13: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై కేంద్ర మంత్రులతో చర్చించినట్టు, త్వరలో దీనిపై సానుకూల నిర్ణయం వెలువడనుందని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, కార్యదర్శులను ఢిల్లీలో ఇటీవల కలిసి స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత పరిస్థితిని వివరించామన్నారు. ప్లాంట్‌కు సహకరించేందుకు ఉన్నట్టు, ఈమేరకు ఆర్థిక సాయంనకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్టు వారు అభి ప్రాయం వ్యక్తంచేసినట్టు చెప్పారు. సెయిల్‌లో విలీనం చేస్తే ప్లాంట్‌కు అన్ని విధాలా మంచిదని వివరించామన్నారు. స్టీల్‌ప్లాంట్ విపత్కర పరిస్థితుల్లో వివరించామన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల ప్రధాన సమస్యల పరిష్కారానికి ఇంటక్ ఎనలేని కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, ఎస్.ఎ.నాయుడు, రాథోడ్, కొమ్ము ప్రసాద్, మోహన్, అవతారం, బీఎస్.రాజు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు సత్వర న్యాయం

- సీజీఆర్ఎఫ్ న్యాయస్థానం చైర్మన్ సత్యనారాయణ


మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆటోనగర్, సెప్టెంబరు 13: విద్యుత్ వినియోగదారులకు అందిస్తున్న సేవల్లో లోపాలను పరిష్కరించి త్వరితగతిన వారికి న్యాయం చేకూర్చటమే సీజీఆర్ఎఫ్ (విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కార న్యాయస్థానం) లక్ష్యమని సంస్థ చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి డా.బి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆటోనగర్ సబ్ డివిజన్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారానికి నిర్వహించిన సదస్సులో ఆయ న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ సంస్థ పరంగా సమస్యలుంటే వినియోగదారులు ఈ న్యాయ స్థానం దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. అయితే, తమ సమస్యలను ముందుగా తమ పరిధి లోని ఈఈలను సంప్రదించాలని, అలాగే, 1912కు టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చన్నారు. సీజీఆర్ఎఫ్‌కు ఫిర్యాదు చేయటానికి ఏ విధమైన ఫీజుగానీ, లాయర్ ఖర్చులు గానీ ఉండవన్నారు. ఈ సందర్భంగా వచ్చిన రెండు ఫిర్యాదులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్, డా.ఆర్.సురేంద్ర కుమార్, ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె. నాయుడు, సాయిబాబా, గాజువాక, ఆటోనగర్ ఏడీఈలు అడబాల పార్థసారథి, సీ.హెచ్. మీనకేతన్ రావు, ఏఈలు చంద్రశేఖర్, శ్రీనివాస్, హరి కుమార్,త్రినాథ్, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

దశల వారీగా అభివృద్ధి పనులు

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

వేపగుంట సెప్టెంబరు 13: ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుతెలిపారు. జీవీఎంసీ 93వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ముందుగా సాయిమాధవనగర్ కాలనీవాసులు సహకారంతో చేపట్టనున్న సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కృష్ణానగర్‌లో హోమియో ఆసుపత్రికి కొత్త భవనం, పరిసరాల్లో రోడ్డు నిర్మాణంకు రూ. 42.69లక్షలతో చేపట్టనున్న పనులను ప్రారంభించారు. అనంతరం ప్రహ్లాదపురం జీవీఎంసీ కళ్యాణ మండపంలో రూ. కోటి నాలుగు లక్షలతో డ్వాక్రా గ్రూపులకు రుణం మంజూరులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడారు. కార్య క్రమంలో కార్పొరేటర్ రాపర్తికన్నా, జెడ్సీ కె.హైమావతి, ఈఈ రత్నాకర్‌రెడ్డి, డీఈ విజయకుమార్, టీడీపీ నాయకుడు గంగవరపోలు, నాగిశెట్టి అప్పలనాయుడు, జనసేన నాయకులు పిన్నింటి పార్వతి, నాగరాజు, సురేతి పాల్గొన్నారు.

'సీతారాం ఏచూరి మృతి తీరని లోటు'


మల్కాపురంలో ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 13: స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షణే సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరికి నిజమైన నివాళని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం సీతారాం ఏచూరి మృతికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో సీతారాం చేసిన పోరాటాలు విశేషమైనవని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు పటిష్ఠం గా ఉండాలని నిరంతరం ఆయన పోరాటాలు చేశారన్నారు. ఆయన లేని లోటు కార్మిక వర్గానికి తీరనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.అయ్యోరామ్, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్. రావు, పి.శ్రీనివాసరాజు, నీరుకొండ రామచంద్రరావు, జె. రామకృష్ణ, కె.వి.డి. ప్రసాద్, బయ్యే మల్లయ్య, బి.అప్పారావు పాల్గొన్నారు.

మల్కాపురం: సీపీఎం నాయకుడు సీతారామ్ ఏచూరి సంతాప సభ మల్కాపురం పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి నాయకుడు ఆర్.దేవరాజు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మల్కాపురం పార్టీ కార్యదర్శి పి.పైడిరాజు హాజరై మాట్లాడారు. సీతారామ్ ఏచూరి విద్యార్థి దశనుంచే ఉద్యమాల్లో పాల్గొని అంచెలంచెలుగా జాతీయ కార్యదర్శిగా, ఎంపీగా ఎదిగారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూకరాజు, రామారావు, సుధకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పెదగంట్యాడ: సీపీఎం జాతీయ ప్రధానకార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతి జాతీయ రాజకీయాలకు తీరని లోటని ఆ పార్టీ గాజువాక నియోజకవర్గం కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ అన్నారు. పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతాల కోసం రాజీలేని పోరాటాలు చేశారన్నారు. సీపీఐ నాయకులు జె రామకృష్ణ, జి ఆనంద్, తాండ్రకనకరాజు, కె రాజబాబు, కె అచ్యుతరావు, యెల్లేటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. దీనికి తొలుతగా సీతారామ్ ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఘనంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు


అక్వేరియం అలంకరణలో విమాననగర్ మండపం వద్ద వినాయక ప్రతిమ

పెందుర్తి, సెప్టెంబరు 13: సుజాతనగర్ ఎనభై అడుగుల రోడ్డులో జిష్ణు ఎన్‌క్లేవ్-2లో అపార్ట్‌మెంటువాసులు ప్రతిష్ఠించిన వినాయకుడిని గురువారం నిమజ్జనం చేశారు. ముందుగా ఉత్సవ కమిటీ నిర్వాహకుడు ప్రతాప్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయం త్రం మహిళల కోలాటం మధ్య స్వామి వారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

అన్న సమారాధన

మల్కాపురం: వినాయకచవితి ఉత్సవాలు పురస్కరించుకుని శ్రీహరిపురం రెండుగుళ్ల ప్రాంగణంలో రైజింగ్‌స్టార్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అన్నదాన సమారాధనను 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాం యువజ న సంఘం ఆధ్వర్యంలో గ్రామ కాలనీలో గణపతి ఉ త్సవాల్లో భాగంగా శుక్రవారం ఏర్పాటుచేసిన అన్న సమారాధనను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి స్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొల్లి కుంచారావు, దూడ పాపారావు, కె పెంటయ్య తదితరులు పాల్గొన్నారు. 68 వార్డు మింది, అక్కిరెడ్డిపాలెం కాలనీలలో నిర్వహించిన అన్నసమారాధనలను వైసీపీ నేత గుడివాడ లతీష్ ప్రారంభించారు.

ఎస్టీబీఎల్‌లో సామూహిక పూజలు

కూర్మన్నపాలెం: గ్రేటర్ 88 వార్డు ఎస్టీబీఎల్‌లో లక్ష్మీ నరసింహ గార్డెన్స్ ఏర్పాటు చేసిన చతుర్భాహ గణపతి మండపంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక ఆలయంలో స్వామివారిని కుంకుమతో అలంకరించి, శ్రీ లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవి కృష్ణయ్య, మహేష్, గాంధీ, భక్తులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ విమాన్‌నగర్‌లోవిమాన్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకచవితి వేడుకలు వైభంగా నిర్వహిస్తున్నారు. అక్వేరియమ్ అంకరణ మధ్య శేష వాతారంలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమ ఆకట్టుకుంటుంది. మర్రిపాలెం రైతుబజారులో ఏర్పాటు చేసిన మండపం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను మార్కెటింగ్‌శాఖ అధికారి షేక్ యాసిన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఉడాకాలనీ అధ్యక్షుడు వాసుదేవరావు, వినియోగదారులు సలహా కమిటీ సభ్యులు వి.సూర్యానారాయణ, బుజ్జీ, పలు రైతుబజార్ల ఈఓలు, రైతులున్నారు.

గణపతికి విశేష కుంకుమ పూజలు

అగనంపూడి: పెదమడక సంపత్ వినాయక ఆలయంలో స్వామి వారికి విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపతి హోమం జరిపారు.సంపత్ వినాయక భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, నెల్లి శ్రీనివాసరావు, మడుగుల నరసింగరావు, విందుల నారాయణరావు, మజ్జి శ్రీనివాసరావు, జగ్గారావు, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.


సుజాతనగర్ విగ్రహ ఊరేగింపులో మహిళలు


కుంకుమ పూజల్లో మహిళలు

కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రితో భేటీ


కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రిని కలిసిన గాజువాక బీజేపీ నాయకులు

గాజువాక, సెప్టెంబరు 13: కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి అశోక్‌ను గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు నేతృత్వంలో నాయకులు శుక్రవారం కలిశారు. గాజువాక విచ్చేసిన ఆయనను కలిసి పలు విషయాలపై చర్చించారు. ఈ ప్రాంతంలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రస్తుతం చేడుతున్న పార్టీ సభ్యత్వ నమోదును వివరించారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్రమోహన్, దీనంకొండ కృష్ణంరాజు, పొలిమేర శ్రీను. నాగేశ్వరరావు, బొత్స దీలీప్, వెన్నా శ్రీరామ్మూర్తి, రాజశేఖర్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులు దూరం


మాట్లాడుతున్న మలేరియా హెల్త్ అసిస్టెంట్ వేణుబాబు

సింథియా, సెప్టెంబరు 13: వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని మలేరియా హెల్త్ అసిస్టెంట్ ఆర్. వేణుబాబు, సూపర్ వైజర్ డి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాంధీజీ వీధి సచివాలయం పరిధి ఎస్సీ కాలనీలో శుక్రవారం జరిగిన డ్రైడే -ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయం శానిటరీ కార్యదర్శి శ్రీనివాసరావు, శానిటేషన్ విభాగం, ఆశా కార్యకర్తలు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

షిప్‌యార్డులో కార్మికులకు వైద్య పరీక్షలు


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మల్కాపురం, సెప్టెంబరు 13: హిందుస్థాన్ షిప్‌యార్డు, గాజువాక ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ సంయుక్తంగా షిప్‌యార్డు కాంట్రాక్ట్ కార్మికులకు శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. 400 మంది కార్మికులు సద్వినియోగం చేసుకున్నారు. ఈ వైద్యపరీక్షలు ఈనెల 20వ వరకు కొనసాగించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీ, అధికారులు, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.1,57 లక్షల సాయం


పల్లా శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న ఆదర్శ స్కూల్ ప్రతినిధులు

గాజువాక, సెప్టెంబరు 13: రాష్ట్ర వ్యాప్తంగా వరదలతో నష్టపోయిన ప్రజలకు సాయమం దించేందుకు గాజువాక ఆదర్శ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం ముందుకు వచ్చింది. పాఠశాలలో విరాళాలుగా సేకరించిన రూ. 1,57,677 చెక్కును టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు శుక్రవారం యాజమాన్యం అందజేసింది. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పావులూరి ప్రభ, ప్రిన్సిపాల్ నేమాని గీత పాల్గొన్నారు.

సాంకేతిక రంగాలపై పట్టు సాధిస్తేనే భవిష్యత్తు


విద్యార్థుల ఆవిష్కరించిన ప్రాజెక్టులను తిలకిస్తున్న వికాస్ పాండా

అగనంపూడి, సెప్టెంబరు 13: సాంతికే రంగంపై విద్యార్థులు పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని పారిశ్రామిక వేత్త వికాస్ పాండా పేర్కొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన విస్టా 2024 టెక్నికల్ ఫెస్ట్‌ను శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర ్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఆయన విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను తిలకించారు. విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు వికాస్ పాండాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి, ప్రిన్సిపాల్ జె. సుధాకర్, రెక్టార్ వి. మధుసూదనరావు, డీన్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నృత్యాలతో విద్యార్థులు సందడి చేశారు.

ఉక్కు పరిరక్షణకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం


రిలే నిరాహార దీక్షల శిబిరంలో నాయకులు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 13: ఉక్కును కాపాడుకోవటానికి ఎంతటి త్యాగాలకైనా సిద్ధమని విశాఖ ఉక్కు పోరాట కమిటీ ఛైర్మన్లు మంత్రి రాజశేఖర్, డి. ఆదినారాయణ అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన 1310వ రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొని వారు మాట్లాడారు ఎన్నికల ముందు విశాఖ ఉక్కును కాపాడుతామన్న కూట మి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఏమేరకు చ ర్యలు తీసుకుంటుందో చెప్పాలన్నారు. స్టీలుప్లాంటుకు భూములిచ్చిన నిర్వాసితులకు ఇంత వరకు న్యాయం జరగలేదన్నారు.మరో నాయకులు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు నిర్వహణ బాధ్యతలను సెయిల్‌కు అప్పగించాలన్నారు. సకాలంలో కార్మికులకు జీతాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు కార్మికులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పందిరి రాట


ఉత్సవ రాట వేస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు

మల్కాపురం, సెప్టెంబరు 13 : గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఉన్న విజయదుర్గా అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం విజయదశమి నవరాత్రుల ఉత్సవాలకు పందిరి రాట వేశారు. గాజువాక డిపో ఆర్టీసీ సెక్రటరీ, ఆలయ వ్యవస్థాపకులు పిల్లా శంకర్‌రావు ప్రత్యేక పూజలు చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.ఈ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు.

రేపు ఘంటసాల బయోపిక్ సినిమా ప్రివ్యూ షో..



డాబాగార్డెన్స్, సెప్టెంబరు 13: సినీ రంగ వైతాళికులు, స్వరకర్త, అపూర్వ గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితాన్ని వెండి తెరపై ఆవిష్కరించిన ప్రయత్నం 'ఘంటసాల' సినిమా అని ఘంటసాల ఆరాధకుల సమూహం ప్రతినిధి డాక్టర్ ఎస్.రహమతుల్లా అన్నారు. ఘంటసాల (బయోపిక్) ది గ్రేట్ తెలుగు సినిమాను ప్రివ్యూ షోను ఈ నెల 15న విశాఖలోని సంగం-శరత్ థియేటర్‌లో ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రదర్శించ నున్నట్లు తెలిపారు. ఈ చిత్రాన్ని డిసెంబరు 4న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాత, దర్శకులు సీహెచ్ రామారావు కృషిచేస్తున్నట్లు తెలిపారు. నేటి యువతరానికి, ఘంటసాల అభిమానులకు ఆయన జీవిత విశేషాలు తెలియజేసే అవకాశం ఈ చిత్రం ద్వారా కలుగుతుందన్నారు. ఇతర వివరాలకు ఫోన్ 98669 70816, 73960 35410ను సంప్రదించాలని ఆయన కోరారు.

విసిగించిన విద్యుత్ కోత

మాధవధార, సెప్టెంబరు 13; పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఉదయం కూడా మాధవధార (ఎస్ఎస్‌టీఎల్) సబ్ స్టేషన్ పరిధిలోని మాధవధార ఉడాకాలనీ ప్రాంతాలకు కరెంటు రావడం, వెనువెంటే పోవడం స్థానికులకు చికాకు పుట్టించింది. ఉదయం తీవ్రంగా కాసిన ఎండలకు తోడు పలుమార్లు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఉక్కబోతతో సతమతమయ్యారు. దీనిపై సబ్ స్టేషన్ సహాయక ఇంజనీరు అప్పలరాజు వివరణ ఇస్తూ ఈ ప్రాంతాల్లో నిర్వహణ పనుల కారణంగా సరఫరాకు అంతరాయమైందన్నారు. సాయంత్రం మారిన వాతావరణంతో అయిదు గంటల నుంచి రాత్రి ఎనిమిది దాటిన వరకు సరఫరా లేదు. ఈ కారణంగా ఈ ప్రాంతాల్లో వ్యాపార వర్గాలు, నివాసితులు అవస్థలు పడ్డారు.



ఆంధ్రజ్యోతి కార్యాలయం పక్కన లక్ష్మీగణపతి ఆలయంలో వినాయకుడు శుక్రవారం లక్ష్మీగణపతిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గణపతి కల్యాణం నిర్వహించారు. -విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



సీతంపేట ప్రధాన రహదారిలోని దుర్గాగణపతి ఆలయంలో శుక్రవారం విష్ణుగణపతిగా భక్తులకు దర్శనమిస్తున్న వినాయకుడు -సీతంపేట



గ్రేటరు 51వ వార్డు కళింగనగర్ యూత్ ఆధ్వర్యంలో కొలువైన గణేషుడికి విశేష పూజలు జరుగుతున్నాయి. -మురళీనగర్

ఆలయంలో దోష నివారణకు పవిత్రోత్సవాలు

జగదాంబ కూడలి, సెప్టెంబరు 13: దేవాలయాల్లో దోష నివారణ కోసం సంవత్సరంలో ఒకసారి పవిత్రోత్సవాల పూజలు నిర్వహిస్తారని అర్చకులు వెల్లడించారు. శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవ పూజలను ఆలయ అధికారులు, వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పూజల్లో పాల్గొన్న ఈవో శ్రీనివాసులు రెడ్డి, ఆలయ అధికారుల చేత అర్చకులు, వేదపండితులు తొలుత విశేషపూజలను భక్తితో నిర్వహించారు. పంచామృతాభిషేకం, గర్భాలయ దర్శనం వంటివి కొంత సేపు నిలిపివేశారు. నిత్య పూజాదికాలను ఆలయ అధికారులు నిర్వహించారు. ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 13: యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో పోర్టు కళావాణి ఆడిటోరియంలో యూ జీనియస్ 3.0 క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్, జోనల్ హెడ్ షాలినీ మీనన్ హాజరయ్యారు. 6 జట్లు తుది రౌండుకు చేరుకోగా వీటిలో విజేతగా డి పాల్ స్కూల్, రన్నరప్‌గా విశాఖవాలీ స్కూల్ నిలిచాయి.కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ హెడ్స్ దేవర శంకర్, శంకర్ హెంబ్రం తదితరులు పాల్గొన్నారు.

'న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి'



సీతమ్మధార యూనియన్ బ్యాంక్ వద్ద నిరసన నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

సీతమ్మధార, సెప్టెంబరు 13: సీతమ్మధార యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బ్యాంక్ అధికారుల సంఘం నాయకుడు కె.రమేష్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర కార్యాలయంలోని ఉన్నత శ్రేణి యాజమాన్యంతో అధికారుల సంఘం, గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలు కలిసి 20 అంశాలపై జరిపిన చర్చలు విఫలం కావడంతో శుక్రవారం దేశ వ్యాప్తంగా 134 ప్రాంతీయ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అధికారులపై పని ఒత్తిడి ఎక్కువగా ఉందని, యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. అవార్డు ఉద్యోగుల సంఘం ప్రాంతీయ కార్యదర్శి ఆర్.వసంతరావు మాట్లాడుతూ బ్యాంక్ శాఖల్లో గుమస్తా ఖాళీలు భర్తీ చేయాలని, కారుణ్య నియామకాలు వెంటనే పూర్తి చేయాలని, తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో త్రినాథ్, సాగర్, శ్రీనివాస్, అనిల్, గురుమూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేధిస్తున్న తాగునీటి సమస్య

- వన్‌టౌన్ పరిధిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వాట్సాప్ సందేశం

పూర్ణామార్కెట్, సెప్టెంబరు 13: వన్‌టౌన్ పరిసర ప్రాంతాల్లో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. కుళాయి నీటి సరఫరా లోపభూయిష్టంగా తయారవ్వడం, 30 నుంచి 39 వార్డుల్లో సక్రమంగా తాగునీటి సరఫరా జరగకపోవడం నిత్యకృత్యంగా మారిందని ప్రజలు జీవీఎంసీ నీటిసరఫరా విభాగం అధికారులను విమర్శిస్తున్నా రు. వారం రోజులుగా మహిళలు తాగునీటి కోసం కుళాయిల వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది. పూర్ణామార్కెట్ పెరికి వీధి తరహాలో వన్‌టౌన్‌లోని పలు వార్డుల్లో మహిళలు తాగునీటి సమస్యపై రోడ్డెక్కేందుకు సిద్ధమవుతున్నారనే విషయం ప్రచారంలోకి వచ్చింది. పాతనగరంలో పూర్తిగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యధోరణి అవలంబిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు గ్రేటర్ 37వ వార్డు పెయిన్‌దొరపేటలో కుళాయి నీటి సరఫరా సక్రమంగా లేదంటూ జనసేన పార్టీకి చెందిన పీతల శ్రీనివాసరావు వాట్సాప్ సమాచారం ఇచ్చారు. అదేవిధంగా 30, 35, 36 వార్డుల్లో కుళాయి నీటిని విడుదల చేసినా ఒకటి రెండు బిందెలకే పరిమితమైందని మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు వార్డుల్లో నాయకులపై మహిళలు విరుచుకుపడుతున్నారు. దక్షిణ ఎమ్మెల్యే తక్షణం వన్‌టౌన్ తాగునీటి సమస్యను గాడిలో పెట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

24 నుంచి ఆలిండియా రైల్వే బాక్సింగ్ చాంపియన్‌షిప్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తదితరులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 13: తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ వాల్తేరు డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి జరగనున్న అఖిల భారత పురుషుల మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీ పోస్టర్‌ను డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వాల్తేరు రైల్వే స్పోర్ట్సు ఎరీనాలో నాలుగు రోజులు జరిగే ఈ టోర్నీలో భారతీయ రైల్వేలోని వివిధ జోన్లకు చెందిన అంతర్జాతీయ, జాతీయ బాక్సింగ్ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్న నేపథ్యంలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, స్పోర్ట్సు ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్సు ఆఫీసర్ బి.అవినాష్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు నైపుణ్యాలు అందివ్వడమే లక్ష్యం

ఐఐఎం డైరెక్టర్ చంద్రశేఖర్

మహారాణిపేట, సెప్టెంబరు 13: అధునాతన యాజమాన్య నైపుణ్యంతో పని చేసేవారిని మరింత శక్తిమంతులుగా చేసే లక్ష్యంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రవేశాలు ప్రారంభించినట్లు డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మహారాణిపేటలోని ఓ సమావేశమందిరంలో ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థికశాస్త్రం, ఫైనాన్స్, అకౌంటింగ్, మానవ వనరులు, వ్యూహాత్మక ఆలోచన, బిజినెస్ ఎథిక్స్ చట్టం వంటి అంశాలను వివరించారు. వ్యూహాత్మక దూరదృష్టి, ఆధునిక వ్యాపార చిక్కులను నేర్పుగా తొలగిస్తూ ముందుకు దూసుకు వెళ్లగల నాయకులను తయారు చేయాలన్నారు. సమావేశంలో యువతీ యువకులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పాఠశాలలో వన సంరక్షణ



కార్పొరేటర్ శ్రావణికి మొక్క అందజేస్తున్న ఉపాధ్యాయినులు

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 13: శ్రీ సాయి సరిగ వంప ట్రస్ట్, బృందావన్ హెల్పింగ్ హ్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అక్కయ్యపాలెం ఎన్జీజీఓఎస్ కాలనీ జీవీఎంసీ పాఠశాలలో వనసంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 26వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ ముక్కా శ్రావణి, గౌరవ అతిథిగా ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీసరస, సంస్థ వ్యవస్థాపకులు హర్షవల్లి పాల్గొన్నారు..

సెయింట్ జోసెఫ్‌లో హిందీ వారోత్సవాలు



కళాశాల వార్షిక పత్రికను ఆవిష్కరిస్తున్న అతిథులు, విద్యార్థినులు

జ్ఞానాపురం, సెప్టెంబరు 13: స్థానిక సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. వారం రోజులుగా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తూ కవితా లేఖనం, క్విజ్, గీతాలాపన, వ్యాసరచన, అంత్యాక్షరి తదితర పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ కళాశాల హిందీ ఆచార్య డా.బి.లక్ష్మి హాజరై హిందీ భాష ప్రాముఖ్యాన్ని వివరించారు. అనంతరం కళాశాల హిందీ వార్షిక పత్రిక ప్రతిభ 18వ సంచికను ఆమె ఆవిష్కరించారు. వివిధ పోటీల విజేతలకు అతిథులు జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందజేశారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న గ్రాండ్ పేరెంట్స్, విద్యార్థినులు

సీతంపేట, సెప్టెంబరు 13: ద్వారకానగర్‌లో గల రవీంద్రభారతి పాఠశాలలో గ్రాడ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాతయ్యలు, అమ్మమ్మ, నాన్నమ్మల పాదాలకు విద్యార్థులు నమస్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఉమ్మడి కుటుంబాల్లో తాతయ్య, అమ్మమ్మ, నాన్నమ్మలకు చాలా ప్రాముఖ్యం ఉందని, క్రమశిక్షణ, విలువలను వారి నుంచి పొందవచ్చని పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్.గాయత్రి తెలిపారు. తమ అనుభవాలను పెద్దలంతా ఉపాధ్యాయులు, విద్యార్థులతో పంచుకున్నారు.

సీటుకో రేటు!

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగి బదిలీ కావాలనుకుంటే ఒక్కరి సిఫారసు సరిపోవడం లేదు. ఎంతమంది ఉంటే అంతమంది దగ్గర నుంచి లేఖలు తీసుకుంటేనే 100 శాతం పని పూర్తయ్యే పరిస్థితి ఉంది. ఈ బదిలీల వ్యవహారం పూర్తిగా ఉన్నతాధికారుల చేయి దాటి పోయింది. రాజకీయ సిఫారసుల మేరకే నిర్ణయాలు తీసుకోవలసి వస్తోంది. దాంతో ఎక్కువ మంది నాయకులను ప్రసన్నం చేయించుకునేవారికే అవకాశం లభిస్తోంది. ఇంతకు ముందు బదిలీ లేఖలను ఉదారంగానే ఇచ్చేవారు. ఇప్పుడు ఎందుకనో ప్రతిఒక్కరూ లక్షలు వసూలు చేస్తున్నారు. ఆఖరుకు కూటమి పార్టీల నాయకులు కూడా సిఫారసు చేస్తున్నారు.

తహసీల్దార్ల బదిలీలపై తర్జనభర్జన

... 5వ పేజీ తరువాయి

బదిలీల విషయంలో ఐటీడీఏ నిబంధనలు అమలు చేయాలని, లేకపోతే న్యాయ పోరాటం చేస్తామని ఏజెన్సీలో పనిచేస్తున్న కొందరు తహసీల్దార్లు అంటున్నట్టు తెలిసింది. ఇదిలావుండగా నగరంలో పనిచేస్తున్న ముగ్గురు తహసీల్దార్లు అనకాపల్లి జిల్లాకు వెళ్లేందుకు సుముఖత వ్యక్తంచేశారు. కూటమికి చెందిన ప్రముఖుడొకరు తన నియోజకవర్గంలో పనిచేయాలని సూచించడంతో ఒకరు, మరో ఎమ్మెల్యే కోర్కె మేరకు ఇంకొక తహసీల్దారు అనకాపల్లి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. గతంలో శివారు ప్రాంతంలో పనిచేసి ప్రస్తుతం నగరంలో పనిచేస్తున్న మరో తహసీల్దారు అనకాపల్లికి వెళ్లడానికి నిర్ణయించారు. అనకాపల్లి జిల్లా నుంచి ఇద్దరు మహిళా తహసీల్దార్లు నగరానికి రావడానికి అక్కడ అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. కాగా విశాఖ జిల్లాలో పనిచేస్తున్న కొందరు తహసీల్దార్లపై ఉన్నతాధికారులు అసంతృప్తితో ఉన్నందున కనీసం ఇద్దరు లేదా ముగ్గురిని అనకాపల్లికి పంపాలని లేదా అప్రాధాన్య పోస్టుల్లో నియమించాలని భావిస్తున్నారు. మరో తహసీల్దార్ అయితే ప్రస్తుతం పనిచేస్తున్న మండలం నుంచి తప్పించాలని కోరుతున్నారు. కలెక్టరేట్‌లో పనిచేయడానికి సిద్ధపడినట్టు చెబుతున్నారు. మరో తహసీల్దారు విషయంలో కూటమికి చెందిన కీలక నేత ఒకరు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, సదరు అధికారిని ఏజెన్సీకి పంపాలని ఉన్నతాధికారులకు స్పష్టంచేశారని జోరుగా ప్రచారం జరుగుతుంది. కాగా బదిలీలకు ఈనెల 22 వరకు గడువు పొడిగించడంతో వచ్చే వారం ఉమ్మడి జిల్లా పరిధిలో ముగ్గురు కలెక్టర్లు భేటీ అయి తహసీల్దార్ల బదిలీలపై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిసింది.

నాలుగు రైతుబజార్లకు సెలవులు రద్దు

... 5వ పేజీ తరువాయి

ఎమ్మెల్యేలకు జాయింట్ కలెక్టర్ తెలియజేసి, వ్యాపారం చేసే వారి నుంచే అద్దెలు తీసుకుంటున్నామని వివరించారు. అయితే వారం వారం సెలవు తీసేయాలని కోరడంతో ఆ మేరకు మొదట నాలుగు బజార్లకు సెలవులు రద్దు చేస్తూ, 24/7 నడపాలని ఆదేశాలు జారీచేశారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖ నగరానికి ఉల్లి, బంగాళాదుంపలు, టమాటా, ఇతర కూరగాయలు సరఫరా చేసే జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌ను కూడా ప్రతి ఆదివారం మూసేస్తారని, రాష్ట్రంలో అన్ని బజార్లకు సెలవులు ఉన్నాయని, ఇక్కడే సెలవులు రద్దు చేయడం అన్యాయం అనే వాదన వినిపిస్తోంది. అన్ని రైతుబజార్లు ఒకే రోజున మూసేయడం లేదు. ఎంవీపీ కాలనీలో బజార్ మూసేస్తే ఆ ప్రాంత వినియోగదారులు అటు పెదవాల్తేరు కానీ, ఇటు సీతమ్మధార కాని వచ్చి కొనుక్కునే వెసులుబాటు ఉంది. అలాగే సీతమ్మధార రైతుబజార్‌ను మంగళవారం మూసేస్తే ఆ ప్రాంతీయులు ఎంవీపీ కాలనీ కానీ, నరసింహనగర్ గానీ వెళ్లి కొనుక్కోవచ్చు. ఇలా ఇబ్బందులు లేకుండా ఒకేరోజు పక్కపక్క బజార్లకు సెలవు లేకుండా ఏర్పాట్లు చేశారు. అయినా రైతులు అడిగారని ఎమ్మెల్యేలు బజార్లకు సెలవు లేకుండా చేయడం సమంజసం కాదనే వాదన వినిపిస్తోంది. వారానికి ఒకరోజు సెలవు ఇవ్వడం వల్ల ఆ రోజున బజార్ మొత్తం శుభ్రం చేసుకోవడానికి వీలవుతోందని నిర్వాహకులు చెబుతున్నారు. అధికారులు మరోసారి ఆలోచన చేసి నిర్ణయం ప్రకటించాలని కోరుతున్నారు. రైతులకు మేలు చేయాలంటే వారికి సరిపడా కొత్త బజార్లు ఏర్పాటు చేయాలని, కూరగాయలు తెచ్చుకోవడానికి అదనపు బస్సులు తిప్పాలని, గిట్టుబాటు ధరలు కల్పించాలే తప్ప ఇలా సెలవు రద్దు చేస్తే పెద్దగా ప్రయోజనం ఉండదనే వాదన వినిపిస్తున్నారు.

విద్యార్థులు దేశభక్తిని అలవరచుకోవాలి

- సెంచూరియన్ వర్సిటీ గౌరవ చాన్స్‌లర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు



వన్‌టౌన్ ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో విద్యార్థుల బృందగానం

జగదాంబ కూడలి, సెప్టెంబరు 13: విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తిని అలవర్చుకోవాలని సెంచూరియన్ యూనివర్సిటీ గౌరవ ఛాన్స్‌లర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. వన్‌టౌన్ ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో భారత్ వికాస్ పరిషత్, ఝాన్సీ లక్ష్మీబాయి మహిళా విభాగం సంయుక్తంగా శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన దేశభక్తి బృందగాన పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య రాజు మాట్లాడుతూ విద్యార్థులకు బృందగాన పోటీలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో బృందగాన పోటీలను పైడా విద్యా సంస్థల అధినేత కృష్ణప్రసాద్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ పోటీల్లో నగరానికి చెందిన పలు పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. హిందీ, సంస్కృతం, జానపదం, మాతృభాషలో దేశభక్తి గీతాలను విద్యార్థులు ఎంపిక చేసుకుని బృందగానం చేశారు. పలువురు సంగీత ప్రముఖులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు నిర్వాహకులు ప్రశంసా పత్రం, బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు వంకాయల సన్యాసిరాజు, రమేష్ చంద్రజైన్, ఎంవీవీ సత్యనారాయణ, ఎంవీ రాజశేఖర్, సీహెచ్ సత్యనారాయణ, పి.భాస్కరరావు, మాణిక్యాలరావు, పి.షర్మిళ, వి.భువన సుందరి, ప్రోగ్రాం కన్వీనర్ పి.వెంకటేశ్వరరావు, ఎంఎస్ఎల్ శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్-శ్రీకాకుళం మధ్య ప్రత్యేక ఏసీ రైలు

విశాఖపట్నం, సెప్టెంబరు 13: పండుగల రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా సికింద్రాబాద్, శ్రీకాకుళం రోడ్డు మధ్య ప్రత్యేక ఏసీ రైలు సర్వీసులు ప్రవేశపెడుతున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07487 నంబరు గల ప్రత్యేక ఏసీ రైలు అక్టోబరు 2 నుంచి నవంబరు 6 వరకు ప్రతి బుధవారం రాత్రి 7.40 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.10 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07488 నంబరు గల ఏసీ ప్రత్యేక రైలు అక్టోబరు 3 నుంచి నవంబరు 7 వరకు గురువారం సాయంత్రం 5.00 గంటలకు శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో బయలుదేరి రాత్రి 6.47 గంటలకు దువ్వాడ, మరుసటి రోజు ఉదయం 9.50 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ సర్వీసులు 17 థర్డ్ ఏసీ, రెండు మోటారు కార్ కోచ్‌లతో నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

పలు రైళ్ల గమ్యం కుదింపు...రీ షెడ్యూల్

విశాఖపట్నం, సెప్టెంబరు 13: వాల్తేరు డివిజన్ పరిధిలోని పూండి-నౌపడ, తిలారు-కోటబొమ్మాళి సెక్షన్ల మధ్య భద్రత నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-పలాస మధ్య నడిచే 07470, 07471 నంబర్లు గల మెము రైళ్లు ఈ నెల 19, 21 తేదీల్లో విశాఖ-శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య రాకపోకలు సాగిస్తాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు-పలాస మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేశామని పేర్కొన్నారు.

రీ షెడ్యూల్; ఈనెల 18న సాయంత్రం 6.50 గంటలకు పాండిచ్చేరిలో బయలుదేరాల్సిన పాండిచ్చేరి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (1289) రాత్రి 9.35 గంటలకు (రెండు గంటల 45 నిమిషాలు), అలాగే ఈ నెల 18, 20 తేదీల్లో మధ్యాహ్నం 1.40 గంటలకు కేఎస్ఆర్ బెంగళూరులో బయలుదేరాల్సిన కేఎస్ఆర్ బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464) సాయంత్రం 4.10 గంటలకు (రెండు గంటల 30 నిమిషాలు) ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేసినట్లు పేర్కొన్నారు.

అంతర్జాతీయ మాస్టర్స్ క్రీడా పోటీల్లో వెంకటలక్ష్మికి 4 స్వర్ణ పతకాలు



సాధించిన పతకాలతో నాగ వెంకటలక్ష్మి

విశాఖపట్నం (స్పోర్ట్సు), సెప్టెంబరు 13: నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ మాస్టర్స్ క్రీడా పోటీల్లో నగరానికి చెందిన ఆళ్ల నాగ వెంకటలక్ష్మి నాలుగు స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించిన నాగ వెంకట లక్ష్మి అథ్లెటిక్స్ మహిళల 45 ప్లస్ ఏళ్ల 60 మీ. రేస్‌తోపాటు డిస్కస్ త్రో, జావెలిన్ త్రో ఈవెంట్లలో ప్రథమ స్థానంలో నిలిచారు. మహిళల పవర్ లిఫ్టింగ్ 85 కిలోల టోర్నీలో అత్యధిక బరువెత్తి స్వర్ణ పతకం సొంతం చేసుకున్నారు. ఇప్పటి వరకు అనేక అంతర్జాతీయ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్, ఐరన్ గేమ్‌లలో పాల్గొని పతకాలు సాధించిన నాగ వెంకట లక్ష్మి, ప్రతిష్ఠాత్మక పోఖ్రా గేమ్స్ అండ్ స్పోర్ట్సులో నాలుగు స్వర్ణ పతకాలు సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వుమెన్స్ హాస్టల్‌లో నీటి సమస్య

- ఇబ్బందులు పడుతున్న ఏయూ ఇంజనీరింగ్ విద్యార్థినులు
- బకెట్లతో మోసుకుంటున్నామని ఆవేదన

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని మహిళా ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్‌లో విద్యార్థినులను నీటి సమస్య ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రతిరోజూ ఉదయం నిద్ర లేచేసరికి ట్యాంకుల్లో నీరు ఉండడం లేదని, దీంతో ఇతర ప్రాంతాల నుంచి బకెట్లతో మోసుకుంటూ వచ్చి అవసరాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఉదయం కాలేజీకి వెళ్లే సమయంలో సమస్య ఎక్కువగా ఉండడంతో తరగతులకు సకాలంలో హాజరుకాలేకపోతున్నామంటున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని, నీటి సమస్య ఎందుకు ఎదురవుతోందో పరిశీలించలేదని తెలిపారు. బాత్రూమ్‌లోకి నీటి సరఫరా నిలిచిపోతుండడంతో బకెట్లతో మోసుకు వచ్చి కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. నిత్యం ఇదే పరిస్థితి ఎదురవుతుండడంతో తెల్లవారుజామున నాలుగు గంటలకే నిద్రలేస్తున్నామని చెబుతున్నారు.

సమస్య ఎందుకు..?

వుమెన్స్ హాస్టల్‌లో సుమారు 1200 మంది వరకు విద్యార్థినులుంటారు. ఇదే క్యాంపస్‌లో మూడు హాస్టల్స్ ఉంటాయి. ఒక్కో విద్యార్థి హాస్టల్‌లో ఉండేందుకు భారీగానే ఫీజు చెల్లిస్తుంటారు. కానీ అధికారులు కనీస వసతులు కల్పించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. నీటి సమస్యకు కారణమేమిటన్న విషయాన్ని అధికారులు గుర్తించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బోర్ వెల్ పని చేయడం లేదా..? ట్యాంకర్లకు నీళ్లు వెళ్లడం లేదా..? అన్నదానిపై స్పష్టత లేకుండా పోయిందంటున్నారు. దీనిపై వివరణ కోరేందుకు హాస్టల్ వార్డెన్ దుర్గారాణికి ఫోన్ చేయగా ఆమె అందుబాటులోకి రాలేదు.కాగా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే తామంతా ఆందోళనకు దిగుతామని విద్యార్థినులు హెచ్చరిస్తున్నారు.

కుర్రపల్లిలో దాహం కేకలు


గ్రామ శివారులో ఉన్న బోరు నుంచి నీరు తీసుకువస్తున్న మహిళలు

పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ కుర్రపల్లి గ్రామాన్ని తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. గోస్తనీ నదికి కూతవేటు దూరంలో ఉన్నా.. గ్రామస్తులకు గుక్కెడు నీరుదొరకడం లేదు. నల్లమారమ్మ గుడి వద్ద ఉన్న బోరు నీరు మాత్రమే ప్రజల దాహార్తి తీరుస్తోంది. ఈ గ్రామంలో 500 మంది జనాభా నివసిస్తున్నారు. మంచినీటి పథకం ట్యాంకును ఏళ్ల తరబడి శుభ్రం చేయకపోవడంతో నీటిలో పురుగులు ఉంటున్నాయి. బోర్లలో ఉప్పు నీరు రావడంతో తాగడానికి పనికి రావడం లేదు. దీంతో మంచినీటితో పాటు వంటకు నీరు తెచ్చుకోవడానికి మహిళలంతా గ్రామ శివారులో ఉన్న బోరు వద్దకు వెళుతున్నారు. సమస్యపై గ్రామస్తులు పలుమార్లు పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.


కాలువపై కుంగిన పలక

ప్రమాదకరంగా పలకలు

మధురవాడ, సెప్టెంబరు 13 : జీవీఎంసీ ఏడో వార్డులో సర్వీసు రోడ్డుకు ఆనుకొని నిర్మించిన కాలువలపై కొన్నిచోట్ల సిమెంటు పలకలు కుంగిపోవడం, మరికొన్ని చోట్ల పూర్తిగా విరిగిపోవడంతో పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. షాపింగ్ మాల్ ఉన్న చోట భారీ వాహనాలు వాటిపై నుంచి లోపలికి వెళుతుండడంతో పలకలు కుంగిపోయి కాలువలో పడిపోతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో ఖాళీ ఏర్పడి పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కాలువలపై పలకలను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

హెల్మెట్ ధరించని 125 మందిపై కేసులు నమోదు


కేసులు నమోదు చేస్తున్న పోలీసులు

సిరిపురం, సెప్టెంబరు 13 : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణాలు సాగిస్తే చర్యలు తప్పవని మూడో పట్టణ ట్రాఫిక్ సీఐ ఎస్. అమ్మినాయుడు హెచ్చరించారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి సిరిపురం ద్రోణంరాజు సర్కిల్ వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనం నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. లేకపోతే వాహన చట్టం ప్రకారం మూడు నెలలు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టి హెల్మెట్ ధరించని 125 మందిపై కేసులు నమోదు చేశారు.

ఏచూరి మృతి పట్ల సంతాపం

ఆరిలోవ, సెప్టెంబరు 13 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మృతి దేశానికి తీరని లోటు అని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి. శ్రీరామ్మూర్తి, జె. రవి అన్నారు. శుక్రవారం వారు ఒక ప్రకటనలో ఏచూరి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఏచూరి చేసిన కృషి ఎనలేనిదని చెప్పారు.

ఆక్రమణలు తొలగింపు

ఆరిలోవ, సెప్టెంబరు 13 : ఆరిలోవ ప్రాంతంలో ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఎక్కడ చిన్న ఖాళీ స్థలం కనిపించినా.. కబ్జాకు పాల్పడుతున్నారు. తోటగరువు బ్రిడ్జికి సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న రైతు బజారు దగ్గరలో విమ్స్ ప్రహరీని ఆనుకొని ఉన్న సుమారు 200 గజాల విమ్స్ స్థలంలో గురువారం రాత్రి కొందరు పాకలు వేయడానికి సిద్ధపడ్డారు. రాత్రి సమయంలో కర్రలు, కలప తీసుకువచ్చి అక్కడ పెట్టారు. శుక్రవారం ఉదయం ఈ విషయం తెలిసిన విమ్స్ సిబ్బంది అక్కడికి వెళ్లి వాటిని తొలగించారు. ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ ఎవరైనా ఆస్పత్రి స్థలాలను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా ఇంజనీరింగ్ దినోత్సవం

తగరపువలస, సెప్టెంబరు 13 : భారతదేశ తొలి ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి (ఈనెల 15) పురస్కరించుకుని శుక్రవారం అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామకృష్ణ, అకడమిక్ డీన్ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **వత్తు వదలరా-2 :** మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నటరాజ్ (పెందుర్తి), మినీ మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), గణేష్ (తగరపువలస)
- **భలే ఉన్నాడే :** రమాదేవి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **ఎ.ఆర్.ఎం. :** శారద, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **35 :** కిన్నెర, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **సరిపోదా శనివారం :** జగదాంబ, సంగం, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ :** శ్రీరామ, లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఉత్సవం :** శ్రీవెంకటేశ్వర, శ్రీనరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 45,టమాటా 30, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 64, బెండకాయలు 55, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 40, బీరకాయలు 50, ఆనపకాయలు 35, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 26, క్యారెట్ 36, దొండకాయలు 44, బంగాళదుంపలు 29, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది) 70, బీట్‌రూట్ 32, బరబటి 50, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 105, గోరుచిక్కుడు 34, దోసకాయ 36, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 110, పొటల్స్ 50, కీరదోస 32, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 54, కంద 54, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 26, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

వైభవంగా శుక్రవారపు తిరువీధి

సింహాచలం, సెప్టెంబరు 13 : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శుక్రవారపు తిరువీధి వైభవంగా జరిగింది. ప్రతి శుక్రవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు మధ్యాహ్నం స్వామివారి పవళింపు సేవ అనంతరం చతుర్భుజి తాయార్, సువర్ణ అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ఆలయ విద్వాంసులు సన్నాయి వాయిద్యాలు, పండితులు వేద పఠనాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ తిరువీధి జరిపారు.

మీసేవా కేంద్రం తనిఖీ

పెదవాల్తేరు, సెప్టెంబరు 13 : చినవాల్తేరులోని మీసేవా కేంద్రాన్ని డిప్యూటీ కలెక్టర్ శైలజ శుక్రవారం తనిఖీ చేశారు. వివిధ పనులపై కేంద్రానికి వస్తున్న వినియోగదారుల నుంచి అధిక మొత్తంలో రుసుము వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఈ సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వాహకుడిపై వినియోగదారులు చెప్పిన ఫిర్యాదులను అధికారులు నమోదు చేసుకున్నారు.

98వ వార్డు అభివృద్ధికి రూ. 2.5 కోట్లు మంజూరు

సింహాచలం, సెప్టెంబరు 13 : జీవీఎంసీ 98వ వార్డు అభివృద్ధికి రూ.2.5కోట్లు మంజూరైనట్టు కార్పొరేటర్ పీవీ నరసింహం తెలిపారు. శుక్రవారం జీవీఎంసీ కార్యాలయంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో తాను ప్రతిపాదించిన పనులకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు.ఈ నిధులతో వార్డులోని పార్కులను అభివృద్ధి చేయనున్నట్టు ఆయన చెప్పారు.

'పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరించాలి'


స్థానికులతో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

సింహాచలం, సెప్టెంబరు 13 : పాత అడివివరం కూడలిలో ఉన్న రావి చెట్టును జీవీఎంసీ అధికారులు తొలగించే చర్యలను సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ వ్యతిరేకించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు శుక్రవారం ఆయన అడివివరం చేరుకుని బీఆర్‌టీఎస్ నిర్మాణంలో భాగంగా అధికారులు తొలగించనున్న రావి చెట్టును పరిశీలించారు. అలాగే పంచ గ్రామాల భూవివాదంపై స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పంచ గ్రామాల భూ సమస్యకు ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. చెట్టు తొలగింపు విషయమై అటవీ శాఖ, జీవీఎంసీ అధికారులతో కలిసి చర్చిస్తానని చెప్పారు.

'బీజేపీ బలోపేతమే లక్ష్యం'


కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి అశోక్‌ను సత్కరిస్తున్న నాయకులు

పెదవాల్తేరు, సెప్టెంబరు 13 : నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ సభ్యత్వ నమోదును కర్ణాటక రాష్ట్ర ప్రతిపక్ష నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆర్. అశోక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో ప్రతి ఆరేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక మాజీ ఎంపీ మునిస్వామి,మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథ్ రాజు, రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్, ఎం. నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


గంటాతో దేవస్థానం ఈఓ, ప్రధానార్చకులు

అప్పన్న పవిత్రోత్సవాలకు గంటాకు ఆహ్వానం

సింహాచలం, సెప్టెంబరు 13 : అప్పన్న ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి ఆహ్వానించారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులుతో కలిసి గంటాను ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ స్వామివారి ఉత్సవాల్లో పాల్గొని కృపకు పాత్రులు కావాలని కోరారు.

ధ్యానంతో విద్యార్థుల్లో ఏకాగ్రత

వెంకోజీపాలెం, సెప్టెంబరు 13 : ధ్యానం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వేణు శ్యామ్ అన్నారు. శుక్రవారం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఎంబీఏ విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మెడిటేషన్, కళావాహన విద్యలను సమ్మిళితం చేస్తూ సాధన చేయడం వల్ల వృత్తిపరమైన, వ్యక్తిగత జీవితంలో ఎంతో ప్రగతి సాధించవచ్చునని చెప్పారు.

17న అనంత పద్మనాభుని చతుర్దశి వేడుకలు



పద్మనాభం, సెప్టెంబరు 13 : పద్మనాభంలో వేంచేసిన అనంత పద్మనాభుడి చతుర్దశి వేడుకలు ఈ నెల 17న నిర్వహించడానికి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈఏడాది అనంతుని ఆలయం పునర్నిర్మాణ దశలో ఉండడంతో ఉత్సవాన్ని దిగువున ఉన్న కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలో చేపడతారు. ఏటా భాద్రపద శుద్ధ చతుర్దశి నాడు అనంతుని వ్రతాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. ఉత్సవంలో భాగంగా పలువురు దంపతులతో వ్రతాలను జరిపిస్తారు. ఈమేరకు ఇప్పటికే ఏర్పాట్లు చేపట్టారు.

పాండ్రంగిలో 'పొలంబడి'


రైతులకు పంటల యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ చలం

పద్మనాభం, సెప్టెంబరు 13 : రైతులు వరి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంబించడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ ఎంవీఎస్ చలం చెప్పారు. శుక్రవారం ఆయన పాండ్రంగి గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో మాట్లాడారు. రైతులకు ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల యాజమాన్యం, వరిలో కాలిబాటలు తీయడం వల్ల ఉపయోగాలు, కలుపు నివారణ పద్ధతులను వివరించారు. అలాగే వరికి ఆకు ముడత తెగులు ఆశిస్తే కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 2 మిల్లీలీటర్లు మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.


ఆరిలోవ : గాంధీనగర్‌లో జరిగిన అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి


మధురవాడలోని సాయిశక్తి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

ఉత్సాహంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

భీమునిపట్నం, సెప్టెంబరు 13 : గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని మండపాల వద్ద శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. ఎగువపేటలో క్యాపిటల్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన పూజలో 3 వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, నూకరాజు పాల్గొన్నారు. గొల్లవీధిలో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలోనూ కుంకుమ పూజ జరిపారు.

కొమ్మాది : గణపతి ఉత్సవాల్లో భాగంగా ఆరో వార్డులోని పీఎంపాలెం కాలనీ లలితాదేవి ఆలయం వద్ద అన్నసంతర్పణ నిర్వహించారు. తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు గరే గురునాథ్ ప్రారంభించిన ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో అన్నదానం నిర్వహించారు. నిర్వాహకులు జేమ్స్ రాజు, రంగాల మంగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, ముగడ రాజారావు పాల్గొన్నారు. 10వ వార్డులో జనసేన నాయకుడు తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో రాగోతి అచ్చుతరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : కొత్త వెంకోజీపాలెంలోని ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెలగపూడి తనయుడు ప్రతాప్‌రుద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, ఆడారి కామేశ్వరరావు, ఎస్. నరసింహారెడ్డి, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. కాగా కొత్త వెంకోజీపాలెంలోని గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం దీపారాధన జరిపారు. జాతీయ రహదారికి ఆనుకుని వేసిన జగన్నాథస్వామి సెట్ వద్ద వినాయకుడి రూపంలో దీపాలు వెలిగించారు.

పెదవాల్తేరు : అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని ఎమ్మెల్యే వెలగపూడి అన్నారు. పెదవాల్తేరులోని చిన్నిపిల్లివారి వీధిలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

సింహాచలం : సింహగిరిపై వర్తక సంఘం ఆధ్వర్యంలో లక్ష దుర్వార్చన నిర్వహించారు. పండితులు శైవాగమ శాస్త్ర విధానంలో వర్తక సంఘం సభ్యుల గోత్రనామాలతో సంకల్పించి గణపతి పూజ, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. గణేషుని సహస్రనామావళి పఠిస్తూ పది ఆవృతులు దుర్వాలతో (గరికలతో) విశేష అర్చన చేశారు.

మధురవాడ : పీఎంపాలెంలోని తారకరామ నగర్‌లో సాయిశక్తి రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజూ వేదిక ప్రదర్శనలు, పలు ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంపటి శ్రీనివాస్, కొమరం ఆదినారాయణ తెలిపారు. శనివారం అత్యంత భారీగా నిమజ్జనం నిర్వహించనున్నట్టు చెప్పారు.


హిందీ అధ్యాపకురాలు జయలక్ష్మిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

ఘనంగా హిందీ దివస్

మద్దిలపాలెం, సెప్టెంబరు 13 : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సెయింట్ జోసెఫ్ కళాశాల హిందీ అధ్యాపకురాలు జయలక్ష్మిని ప్రిన్సిపాల్ విజయబాబు, సిబ్బంది సన్మానించారు. అనంతరం జయలక్ష్మీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం హిందీని అధికారిక భాషగా స్వీకరించిన రోజు కావడంతో హిందీ దివస్ నిర్వహించుకుంటున్నామన్నారు. జాతీయోద్యమంలో ప్రజలందరినీ ఏకతాటిపై నడిపేందుకు హిందీ ఎంతగానో ఉపయోగపడిందని చెప్పారు. ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువగా మాట్లాడే భాషల్లో హిందీ రెండోస్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. జయ, అధ్యాపకులు బి. లక్ష్మీ, పోల ఉమామహేశ్వరరావు, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

కాపులుప్పాడలో వ్యవసాయాధికారుల పర్యటన


కాపులుప్పాడలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

భీమునిపట్నం, సెప్టెంబరు 13 : మండలంలోని కాపులుప్పాడ, కల్లివానిపాలెం గ్రామాల్లో వ్యవసాయాధి కారులు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏఓ శివ కోమలి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. భారీ వర్షాల నేపథ్యంలో వరి పంటకు ఆకుముడత, తెల్ల చిత్త, నాము తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మండలంలో ఇప్పటివరకు సుమారు 1245 ఎకరాల్లో వరి పంట విస్తీర్ణం నమోదైందని చెప్పారు. కొన్నిచోట్ల పురుగు ఆశించి వుందన్నారు. పొలాల్లో నిలిచిన నీటిని బయటకు తోడిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పోటాష్ చల్లుకోవాలని సూచించారు. అలాగే ఎకరాకి 500 ఎంఎల్ వేప నూనే పిచికారీ చేసినట్లయితే ఆకుముడత, దోమను అరికట్టవచ్చన్నారు. ఆకుముడత, తెల్లచిత్త ఆశించిన పంటకు దుబ్బులో ఆకులు నిలువునా ముడుచుకుని, తెల్లని చారలు కనిపిస్తాయని, ఈ లక్షణాలను గుర్తించిన వెంటనే ఎకరాకు 400 గ్రాములు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును పిచికారీ చేయాలని సూచించారు. అక్కడక్కడ పాము పొడ తెగులు ఉందని, దీని నివారణకు ఎకరాకి హెక్సకొనజోల్ 400 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలని చెప్పారు.

మధురవాడలో కుండపోత వర్షం


ఎత్తు వంతెన వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

మధురవాడ, సెప్టెంబరు 13 : మధురవాడలో శుక్రవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది.రహదారులపై మోకాలు లోతులో నీరు ప్రవహించింది. కాలువల్లోని నీరు రోడ్లపైకి రావడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. కారుషెడ్ నుంచి మిథిలాపురి వెళ్లే రోడ్డులో నడుం లోతులో నీరు నిలిచిపోవడంతో అర్ధ గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. చంద్రంపాలెం, తదితర ప్రాంతాల్లో కాలువలు మీదుగా నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో ఏమాత్రం వర్షం పడినా రోడ్లు జలమయమవుతున్నాయి. పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి కాలువల్లో పూడికలు తీయించాలని పలువురు కోరుతున్నారు.

సాగర్‌నగర్ : సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, రుషికొండ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ ఉండగా సాయంత్రం 5.30 గంటలకు ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై గంట పాటు వర్షం పడింది.

అప్పన్న నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం


దాతకు బాండ్ ఇస్తున్న ఏఈఓ శ్రీనివాసరావు

సింహాచలం,సెప్టెంబరు 13 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యన్న ప్రసాద పథకానికి నగరంలోని ఇసుకతోటకు చెందిన ఆకెళ్ల శ్రీనివాస జవహర్‌లాల్ నెహ్రూ దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో నిత్యాన్న ప్రసాద విభాగం సహాయ కార్యనిర్వాహణాధికారి పిళ్లా శ్రీనివాసరావుకు శుక్రవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాత కుటుంబ సభ్యులకు అంతరాలయ దర్శనం కల్పించి, స్వామివారి వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

భీమునిపట్నం, సెప్టెంబరు 13 : విద్యార్థులు క్రమశిక్షణతో విద్య నేర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల సూచించారు. శుక్రవారం ఆమె కళాశాలలో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాలలో వసతులను, అధ్యాపకుల బోధనలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ బి. ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థులకు ఉద్యోగాలు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 13 : ఏయూ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం పట్ల వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ)లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులు అపూర్వ, రవి, కిరణ్, నూకరాజును శుక్రవారం వారు తమ కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డైరెక్టర్ వీఆర్ రెడ్డి. ప్లేస్‌మెంట్ అధికారి పి. మోహన్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ స్టేషన్ సీఐగా మురళి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 13 : ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ సీఐగా జె. మురళి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన సీఐ సంజీవరావును రేంజ్‌కు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో మురళి వచ్చారు. 1998 బ్యాచ్‌కు చెందిన మురళి గతంలో విశాఖ సిటీ పరిధిలోని పెందుర్తి, ఎయిర్‌పోర్టు స్టేషన్లలో పనిచేశారు. ప్రస్తుతం విజయనగరం డీసీ ఆర్‌బీ నుంచి బదిలీపై వచ్చారు.